@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512

# మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

సోమవారం
05 అక్టోబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :93
పేజీలు : 12 వెల : 5/-

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE







## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో
# వేగం పెంచాలి



- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో షియర్‌జోన్ దాటిన తవ్వకాలు
- 2028 నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు జరుగుతున్నాయి
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.
- ప్రధాన టన్నెల్‌లో ఇప్పటి వరకు 79 శాతం పనులు పూర్తి
- ఎస్ఎల్‌బీసీ పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు.

హైదరాబాద్

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో కీలక ముందడుగు పడిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రమాదకరమైన షియర్‌జోన్‌ను దాటి తవ్వకాలు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గత ఐదు నుంచి ఆరు నెలల్లో సుమారు 700 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఎస్?ఎల్?బీసీ పనులపై అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. - మిగతా9లో



## అమెరికా కావాలనే
# ఒంటరి శక్తిగా మారింది

- చైనా ఎదుగుదలతో ప్రపంచంలో కొత్త పోటీ
- అమెరికా, చైనాపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- తన విధానాల్లో మార్పు చేసుకొని అమెరికా కావాలనే ఒంటరి శక్తిగా మారిందని స్పష్టం
- అమెరికా- చైనా పోటీతో పరిస్థితులు మారిపోయాయన్న కేంద్ర మంత్రి
- అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొత్త అవకాశాలు

# గవర్నర్ కోటాపై
# కాంగ్రెస్ నజర్

- ఎమ్మెల్సీ రేసులో ఉన్నది వీరేనట..!
- తెలంగాణలో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ
- ఆశావహులు పార్టీ పెద్దలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ నేతలను కలుస్తున్నట్లు ప్రచారం
- ఈసారి సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తుండగా, రెండు స్థానాలను బీసీలకు కేటాయించే అంశంపై చర్చ
- పద్మశాలి, ముదిరాజు సామాజికవర్గాల నేతల పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి.



హైదరాబాద్

తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ అంశం కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికరంగా మారింది. మూడు స్థానాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడకముందే ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎమ్మెల్సీ పదవుల కోసం పార్టీ ముఖ్య నేతలతో పాటు ఢిల్లీ స్థాయిలోనూ లాబీయింగ్ మొదలైనట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పలువురు నేతలు ఇప్పటికే.. సీఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ కోరినట్లు ప్రచారం.. అంతేకాకుండా.. పీసీసీ అధ్యక్షుడితో కూడా సమావేశం అవుతున్నారని పేర్కొంటున్నారు. అయితే.. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి మరో రెండు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఆశావహులు తమకు అవకాశం దక్కేలా పార్టీ పెద్దలను కలుస్తున్నట్లు సమాచారం ఈసారి ఎమ్మెల్సీ ఎంపికలో సామాజికవర్గాల సమీకరణలు కీలకంగా మారే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను రెడ్డి - మిగతా9లో



## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి
# చంద్రబాబుకు పంపిస్తున్నాడు

- కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్
- రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు



# శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు..

- శిలాతోరణం వరకు బారులు తీరిన క్యూలైన్లు
- తిరుమలలో కొనసాగుతున్న భక్తుల అధిక రద్దీ
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నిండి శిలాతోరణం వరకు చేరిన క్యూలైన్లు
- సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతుందని అంచనా
- శనివారం శ్రీవారిని 91,296 మంది దర్శించుకోగా, హుండీ ద్వారా రూ.5.06 కోట్ల ఆదాయం

# అమల్లోకి కొత్త
# మున్సిపల్ చట్టం

- ఇకపై సేవలు మంరిత సులభం!
- హైదరాబాద్ నగర ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత సులభతరం చేసే కొత్త చట్టం అమల్లోకి వచ్చింది.
- ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం 70 ఏళ్ల నాటి జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో కోర్ అర్బన్ రీజియన్ చట్టం--2026 తీసుకొచ్చింది.
- అక్టోబర్ 2 నుంచి కొత్త చట్టం అమల్లోకి వచ్చింది




హైదరాబాద్

హైదరాబాద్ నగర ప్రజలకు మున్సిపల్ సేవలు మరింత సులభతరం చేసే కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. మున్సిపల్ శాఖను స్వయంగా చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నగర పాలనపై నేరుగా పర్యవేక్షణ సాగించేలా కొత్త వ్యవస్థలో కీలక మార్పులు చేశారు. సీఎం అధ్యక్షతన క్యూర్ అపెక్స్ గవర్నెన్స్ కౌన్సిల్ పనిచేస్తుంది. నగరాభివృద్ధి ప్రాధాన్యాలను ఈ కౌన్సిల్ నిర్ణయిస్తుంది. కార్పొరేషన్లు, పోలీస్, రెవెన్యూ, హెచ్ఎండీఏ, జలమండలి, విద్యుత్, మెట్రో, ఆర్టీసీ, హైడ్రా అధికారులు ఒకే వేదికపై చర్చించి నిర్ణయాలు తీసుకునే వ్యవస్థ కొత్త చట్టంలోకి వచ్చింది. 1955లో పాత మున్సిపల్ చట్టం వచ్చినప్పుడు హైదరాబాద్ జనాభా సుమారు 15 లక్షలు. ఇప్పుడు కోర్ అర్బన్ రీజియన్‌లో దాదాపు 1.3 కోట్ల మంది నివసిస్తున్నారు. నగరం భారీగా విస్తరించింది. వరదలు, ఎండ తీవ్రత, వాయు కాలుష్యం, నీటి కొరత, ట్రాఫిక్, చెరువులు--నాలాల ఆక్రమణలు, ఎత్తైన - మిగతా9లో



## కొత్త జాబ్ కార్డుల జారీకి
# లైన్ క్లియర్

- గ్రామీణులకు ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఉపాధి హామీ పథకం కింద కొత్త జాబ్ కార్డుల జారీకి ఆమోదం
- కరువు పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డుల విడుదలకు సిద్ధమైంది

హైదరాబాద్

తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా జాబ్ కార్డులు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎల్‌నినో పరిస్థితుల క్రమంలో కొత్త జాబ్ కార్డులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎల్‌నినో ప్రభావంతో గతంతో పోలిస్తే సాధారణ వర్షపాతం భారీగా పడిపోయింది. - మిగతా9లో



# ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా దాడి.. ఒకరి మృతి

- ఉక్రెయిన్‌లో భారతీయ ఫార్మా కంపెనీపై రష్యా డ్రోన్ల దాడి
- సుమీ నగరంలోని కుసుమ్ గ్రూప్ ప్లాంట్ దాదాపు ధ్వంసం
- దాడిలో ఒకరు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
- దాదాపు రూ.400 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా

సంపాదకీయం

# కాలుష్యకాలంలో ఢిల్లీ!

ఢిల్లీలో ఈ సమయంలో సర్వసాధారణంగా ఉండాల్సిన ఉష్ణోగ్రతలు ఇప్పుడు బాగా తగ్గిపోయాయంటే, అదేమీ సంతోషించాల్సింది కాదు. 2008 తరువాత సెప్టెంబర్ నెలాఖరులో అత్యల్ప ఉష్ణోగ్రత రికార్డు కావడమన్నది నగరం చల్లబడిందని కాక, దేశ రాజధాని మళ్ళీ కష్టకాలంలోకి జారుకుంటోందన్న హెచ్చరిక. వాయు కాలుష్యంతో ఈ శీతాకాలంలో నగరవాసులు మరోమారు నరకం అనుభవించబోతున్నారని అర్థం. ప్రతి ఏటా ఢిల్లీ ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు కొన్ని ప్రకటిస్తుంది. శీతాకాలంలో పాలకులకు ఇది ఒక క్రమం తప్పలేని ఎజెండా. సోమవారం కూడా మళ్ళీ అదే జరిగింది. పలురకాల నిర్మాణాలమీద నిషేధం విధించారు, కార్యాలయ వేళల్లో మార్పుచేర్పులు ప్రకటించారు, ఆఫీసులకు వచ్చిపనిచేసే సిబ్బందిలో సగంమందిని ఇంటినుంచి పనిచేయాలంటున్నారు, నగరం బయట రిజిస్టరయిన వాహనాల నగర ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు, పార్కింగ్ చార్జీలు కూడా పెంచారు. ఈ జాబితాలో ఏవి ఎప్పటినుంచి అమల్లోకి రాబోతున్నాయన్నది అటుంచితే, శీతాకాలం ప్రవేశం వరకూ ఇష్టారాజ్యంగా సాగినవన్నీ, ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైనవిగా తోచడం, పరిణమించడం విశేషం. ఇప్పటిచలి తాత్కాలికమేనని, అల్పపీడన ప్రభావం తగ్గితే పరిస్థితిలో కాస్తంత మార్పు రావచ్చని అంటున్నప్పటికీ, కాస్తంత అటూఇటూగా ఈ సంక్షోభం ఏటా ఎదుర్కోక తప్పనిదే. నిర్మాణాలు, కూల్చివేతలమీద పూర్తిస్థాయి నిషేధాన్ని అటుంచితే, ఇప్పటికే అమలులో ఉన్న 'నో ఫ్యూయల్––నో పీయూసీ' విధానాన్ని మరింత కఠినంగా అమలు చేస్తారట. ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలు ఉన్న ఐదువందల పెట్రోల్ బంకుల్లో పాతవాహనాలమీద విరుచుకుపడతారట. రెండున్నర లక్షలవాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయబోతున్నట్టు, ఉన్న ఐదువేల ఎలక్ట్రిక్ బస్సులకు మరో నూటయాభై బస్సులను చేర్చి ప్రజారవాణాను మెరుగుపరచనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. పార్కింగ్ ఫీజులను భారీగా పెంచితే, ప్రజలు విధిగా ప్రజారవాణావైపు పరుగులు తీస్తారని అది బలంగా నమ్ముతున్నట్టు కనిపిస్తోంది. ప్రజలు నిజంగానే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మీదే ఆధారపడితే, ఢిల్లీలో ఉన్న ఆ వ్యవస్థ ఏమాత్రం సరిపోదు. పద్నాలుగువేల బస్సులు అవసరమైన చోట సగం మాత్రమే ఉన్నాయి, నగరంలోని మొత్తం ప్రయాణికుల్లో ఐదుశాతం జనాభాను మాత్రమే మెట్రో తీసుకుపోతోంది. ఇక, వెచ్చదనంకోసం ప్రజలు చెత్తనీ, బొగ్గూకట్టెలూ కాల్చకుండా నిరోధించడానికి తాత్కాలికంగా విద్యుత్ హీటింగ్ స్పాట్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలంతా అక్కడికే వెళ్ళి చలికాచుకుంటారని కూడా ప్రభుత్వం నమ్మకం. కాలుష్యకాలం కమ్ముకొచ్చినప్పుడు, బాణాసంచా వినియోగం కూడా ఒక పెద్దసమస్యగా, వివాదంగా మారడం ఏటా ఉన్నదే. టపాసుల వాడకంమీద ఆంక్షలు విధించాలంటూ దాఖలైన పిటిషన్‌మీద సుప్రీంకోర్టు బుధవారం తన అభిప్రాయాన్ని ప్రకటిస్తూ, పూర్తి నిషేధానికి తాను అనుకూలం కాదని, అలాగని, రోజంతా కాల్చడానికి ఒప్పుకోనని వ్యాఖ్యానించింది. కొన్ని రకాల టపాసుల తయారీకి కూడా ఇకపై వీలు కలగబోతోంది. దీపావళినాడు బాణాసంచా కాల్చే విషయంలో సుప్రీంకోర్టు వైఖరిలో ఇటీవల పెనుమార్పు వచ్చిన విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఏలుబడిలో ఉన్నంతకాలం ఢిల్లీలో టపాసులమీద నిషేధం అమలైంది. మొదట్లో బేరియం లవణాలు లేని టపాసుల తయారీకి అనుమతించినప్పటికీ, ఆ మినహాయింపు కూడా దుర్వినియోగం కావడంతో పూర్తి నిషేధం అమలైంది. పాలకుల, న్యాయస్థానాల చొరవవల్ల, పెరిగిన కాలుష్యభయం వల్ల ఢిల్లీ వాసుల్లో కూడా టపాసులమీద మోజు తగ్గింది. విపక్షంలో ఉండగా, ఈ నిషేధాన్ని తప్పుబడుతూ వచ్చిన బీజేపీ ఢిల్లీలో తాను అధికారంలోకి రాగానే టపాసులపై సర్వోన్నత న్యాయస్థానంతోనే సరే కానివ్వండని అనిపించుకుంది. పొరుగురాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం కూడా ఢిల్లీ కాలుష్యానికి ఒక బలమైన కారణం కనుక, పరిస్థితిలో మార్పు వస్తున్నా ఈ మారు కూడా ఆ ప్రభావాన్ని కాదనలేం. ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో అనేకం గతకాలంలోనూ అమలు జరిగినవే. గద్దెమీద ఎవరున్నా ఈ తక్షణ ఉపశమన చర్యలనే మహాద్భుతమైనవిగా అభివర్ణించుకోవడం సహజం. గ్యాస్ చాంబర్‌లాగా తయారైన ఢిల్లీలో వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్న సామాన్యులకు ఏటా వచ్చే ఈ ఆపదనుంచి విముక్తి ఎప్పుడో తెలియడం లేదు.

# పాన్ ఐఐటీ.. రాష్ట్ర భవిష్యత్తుకు ఇన్నోవేషన్ ఇంజిన్



ఒక రాష్ట్రాన్ని మార్చేది కేవలం భారీ పెట్టుబడులు కాదు. ఆ పెట్టుబడులకు దారితీసే ఆలోచనలు, ఆ ఆలోచనలను ఆవిష్కరణలుగా మలిచే పరిశోధన, ఆ ఆవిష్కరణలను పరిశ్రమలుగా తీర్చిదిద్దే సమర్థ వ్యవస్థ. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న ప్రస్తుత సమయంలో ఒక రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించేది కేవలం సహజ వనరులు మాత్రమే కాదు.. జ్ఞానం, నైపుణ్యం, సాంకేతికత, ఆవిష్కరణ సామర్థ్యం. అందుకే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రయాణంలో పాన్ ఐఐటీ వంటి మేధో వేదికకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

నేడు విజయవాడలో జరగనున్న పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్ ఈ దిశగా ఒక ముఖ్యమైన ప్రయత్నం. దేశ విదేశాల్లో ఉన్న ఐఐటీ పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, పాలసీ రూపకర్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం దీని ప్రధాన ఉద్దేశం. వారి అనుభవం, పరిజ్ఞానం, పరిచయాలు, పెట్టుబడి సామర్థ్యాన్ని ఏపీ అభివృద్ధికి అనుసంధానం చేయడం ద్వారా కొత్త అవకాశాలను సృష్టించవచ్చు.

అమెరికాలో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం చుట్టూ ఏర్పడిన పరిశోధన, పరిశ్రమ వాతావరణం సిలికాన్ వ్యాలీకి బలమైన పునాది వేసింది. జర్మనీలోని ఫ్రాన్‌హోఫర్ సంస్థలు పరిశోధనను పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేసి సాంకేతికతను వాణిజ్యీకరణ దిశగా తీసుకెళ్తున్నాయి. ఇజ్రాయెల్ స్టార్టప్ వ్యవస్థ, సింగపూర్ పరిశోధన–– పరిశ్రమ అనుసంధానం, తైవాన్ సెమీకండక్టర్ పర్యావరణం కూడా నాలెడ్జ్ ఆర్థిక శక్తిగా ఎలా మారుతుందో చూపిస్తున్నాయి.

ఈ నమూనాల నుంచి రాష్ట్రం నేర్చుకోవాల్సిన ప్రధాన విషయం ఒక్కటే. ప్రతిభను ఒకచోట చేర్చడం మాత్రమే కాదు.. ఆ ప్రతిభను రాష్ట్రాభివృద్ధి అవసరాలతో అనుసంధానం చేయాలి. రాష్ట్రంలోని సమస్యలకు ఐఐటీలు, పరిశోధన సంస్థలు, పరిశ్రమలు కలిసి పరిష్కారాలు చూపే విధానం రావాలి. కొత్త ఆలోచనలు ప్రోటోటైప్‌లుగా మారాలి. ప్రోటోటైప్‌లు స్టార్టప్‌లుగా మారాలి. స్టార్టప్‌లకు పెట్టుబడులు రావాలి. అవి పరిశ్రమలుగా ఎదిగి ఉపాధి కల్పించాలి. ఆ ఉపాధి, ఉత్పాదకత చివరకు... రాష్ట్ర ఆర్థిక వృద్ధికి బాట వేయాలి అనే వ్యవస్థ రాష్ట్రంలో ఏర్పడాలి. ఇదే నిజమైన ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్.

దేశం కూడా ఇదే దిశగా అడుగులు వేస్తోంది. ఇండియా ఏఐ మిషన్, నేషనల్ క్వాంటమ్ మిషన్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ వంటి కార్యక్రమాల ద్వారా కృత్రిమ మేధస్సు, క్వాంటమ్, డీప్‌టెక్, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ, మెడికల్ డివైజెస్ వంటి రంగాల్లో పరిశోధన, ప్రైవేట్ పెట్టుబడులకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ జాతీయ అవకాశాలను రాష్ట్ర అవసరాలతో అనుసంధానం చేసుకోవడం కీలకం. ఈ నేపథ్యంలో అమరావతిలో ఏఐ, క్వాంటమ్ రంగాలకు ప్రత్యేక యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు ఎన్‌ఐఈఎల్‌ఐటీ, రాష్ట్రం మధ్య జరిగిన ఒప్పందం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్ ఏఐ/ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ హార్డ్‌వేర్, ఏఐ–– క్వాంటమ్ రీసెర్చ్, ఇండస్ట్రీ లింక్‌డ్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, డీప్‌టెక్ ఇంక్యుబేషన్ వంటి రంగాలను ఒకే పరిధిలోకి తీసుకురావాలనే ఆలోచన భవిష్యత్ సాంకేతిక అవసరాలకు అనుగుణంగా ఉంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఐబీఎంతో భాగస్వామ్యం, క్వాంటమ్ కంప్యూటింగ్ మౌలిక వసతుల ఏర్పాటుకు జరుగుతున్న ప్రయత్నాలు కూడా ఈ దిశలోనే ఉన్నాయి. అయితే ఇలాంటి ప్రాజెక్టులు, సంస్థలు ఏర్పడితేనే సరిపోదు. వాటి చుట్టూ పరిశోధన, పెట్టుబడి, పరిశ్రమ, స్టార్టప్ వ్యవస్థ ఏర్పడాలి. ఒక ఆలోచనకు నిధులు దొరకాలి. ఒక పరిశోధనకు పరిశ్రమ భాగస్వామ్యం కావాలి. ఒక స్టార్టప్‌కు మార్కెట్ దొరకాలి. ఒక విద్యార్థికి ప్రపంచస్థాయి మెంటార్ లభించాలి. ఒక పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం రాష్ట్రంలోనే అందుబాటులో ఉండాలి. అప్పుడే మేధస్సు ఆర్థిక విలువగా మారుతుంది. పాన్ ఐఐటీని ఈ మొత్తం వ్యవస్థకు అనుసంధానించే వేదికగా మలచాల్సిన అవసరం ఇక్కడ కనిపిస్తుంది. కేవలం ఏడాదికి ఒకసారి జరిగే సదస్సుగా కాకుండా, పాన్ ఐఐటీ అమరావతి కౌన్సిల్, గ్లోబల్ ఐఐటీ మెంటార్ నెట్‌వర్క్, డీప్‌టెక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ పరిశ్రమలతో అనుసంధానమైన పరిశోధన కేంద్రాలు వంటి శాశ్వత వ్యవస్థలు ఏర్పడితే దాని ప్రభావం మరింత విస్తరించవచ్చు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని వివిధ రంగాలకు ఈ మేధోశక్తిని అనుసంధానం చేయవచ్చు.

ప్రపంచం ఇప్పుడు ఏఐ, క్వాంటమ్, సెమీ కండక్టర్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, స్పేస్‌టెక్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో కొత్త పోటీని చూస్తోంది. రేపటి ఆర్థిక శక్తి ఈ సాంకేతిక రంగాల్లోనే రూపుదిద్దుకోనుంది. ఈ పోటీలో నిలబడాలంటే భౌతిక మౌలిక వసతులతో పాటు మేధో మౌలిక వసతులు కూడా నిర్మించాలి. పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువత నైపుణ్యాలను పెంచాలి. ఆవిష్కరణలకు పెట్టుబడులు అందించాలి. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య దూరాన్ని తగ్గించాలి. అందుకే పాన్ ఐఐటీని మరో సదస్సుగా చూడకూడదు. వికసిత్ భారత్––2047 లక్ష్యానికి అనుగుణంగా జ్ఞానాధారిత, సాంకేతికంగా శక్తిమంతమైన, ఆవిష్కరణలకు నిలయమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే దీర్ఘకాలిక వేదికగా మలచాలి. ప్రపంచ ఐఐటీ మేధస్సును రాష్ట్ర భవిష్యత్తుతో అనుసంధానం చేయగలిగితే.. పాన్ ఐఐటీ ఒక కార్యక్రమంగా కాక, రాష్ట్ర భవిష్యత్తును నడిపించే ఇన్నోవేషన్ ఇంజిన్‌గా రూపుదిద్దుకుంటుంది.

# ప్రభుత్వ వ్యతిరేకత'కు బీజేపీ అతీతమా?

రాహుల్‌గాంధీ ఇటీవల ఒక ప్రశ్న అడిగారు. రాజకీయ వర్గాలలో కలకలం సృష్టించిన ఆ ప్రశ్న సులభంగా ఉన్నట్టు కనిపిస్తున్నా నిజానికి సంక్లిష్టమైనది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారతీయ జనతా పార్టీ ఒక దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావానికి ఎందుకు గురికావడం లేదు? 1977లో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్న కారణంగా మా నానమ్మ ఇందిర సైతం ఓడిపోయారు అని ఆయన అన్నారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ అధికారంలో కొనసాగేలా ఎన్నికల ప్రక్రియను తారుమారు చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. ఎన్నికల్లో జయాపజయాల విషయమై రాహుల్ ఇటీవల చేసిన వివిధ వ్యాఖ్యలలో మాదిరిగానే తాజా ఆరోపణలో కూడా ఒక ఇబ్బందికరమైన సత్యం ఉంది. ఒక విషయంలో రాహుల్ సరిగానే మాట్లాడారు. ఎన్నికల సంఘం తీవ్ర విశ్వసనీయత లోటును ఎదుర్కొంటోంది. అవును, ఈ సత్యం ఇంకెంత మాత్రం ఒక చర్చనీయాంశంగా ప్రతిపక్షాలకే పరిమితమై లేదు. ఈసీఐపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారనడం సత్యదూరం కాదు. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్లు నివేదించిన వివరాలలో 'తార్కిక వ్యత్యాసం'కు సంబంధించిన సమస్యలు, లక్షలాది ఓటర్ల తొలగింపుపై రగడ, ఓటర్ల అప్పీళ్లపై విచారణలో జాప్యం మొదలైనవన్నీ ఎన్నికల సంఘం పారదర్శకతపై న్యాయబద్ధమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాజ్యాంగ సంస్థల మధ్య 'విశ్వాస లోటు' ఉన్నదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించిందంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

ఓటర్ జాబితాల ధర్మబద్ధత గురించి పట్టించుకునే ఎవరికైనా ఈ అంకెలు ఆందోళన కలిగిస్తాయి. బెంగాల్‌లో ఇంతవరకు 22 లక్షల మంది పౌరులు తమ ఓటు హక్కు తొలగింపుపై అప్పీల్ చేశారు. విచారణ పూర్తయిన అప్పీళ్లలో 93శాతం మంది చట్టబద్ధమైన ఓటర్లే అని నిర్ధారణ అయింది. ఎన్నికలు అంటే కేవలం పోలింగ్ రోజున జరిగే ప్రక్రియ మాత్రమే కాదు. ఓటర్ జాబితాలలో ఎవరికి చోటు దక్కుతుందనే అంశంతోనే నిజానికి ఎన్నికలు ప్రారంభమవుతాయి. మరి తన పనితీరుపై ఆందోళనలను కేవలం రాజకీయ ఆరోపణలు మాత్రమేనని ఎన్నికల సంఘం ఎలా కొట్టివేయగలుగుతుంది? ఎన్నికల సంఘం తటస్థ మధ్యవర్తిగా వ్యవహరించడం లేదనే ఆందోళనలు ఇటీవల వివిధ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించిన తీరుతెన్నుల ఆధారంగానే వ్యక్తమవుతున్నాయన్నది నిరాకరించలేని వాస్తవం.

మన దేశంలో ఒపీనియన్ పోల్స్ నిర్వహించే ఏజెన్సీలు కూడా రాజకీయ కుట్రల్లో భాగమా? 2014 నుంచి నరేంద్ర మోదీకి ప్రజాదరణ–– ముఖ్యంగా హిందీ భాషా రాష్ట్రాలలోను, పశ్చిమ భారత రాష్ట్రాలలోనూ అంతకంతకూ పెరుగుతోందని అన్ని ఒపీనియన్ పోల్స్ ఫలితాలు నిర్ధారిస్తూనే ఉన్నాయి. ఆ పోల్స్ అన్నీ ప్రామాణిక పద్ధతులలో జరిగి ఉండకపోవచ్చు. అయినంతమాత్రాన వాటి ఫలితాలకు కారణమైన రాజకీయ పరిణామాన్ని కొట్టివేయడం సబబు కాదు. దానిని నిష్పాక్షికంగా అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీకి అసాధ్యంగా ఉన్న మహా శక్తిమంతమైన రాజకీయ, సంస్థాగత యంత్రాంగాన్ని బీజేపీ అభివృద్ధిపరచుకున్నది. కార్యకర్తల బలాన్ని అపారంగా పెంచుకున్నది. పైగా ఆరెస్సెస్ నుంచి సంపూర్ణ మద్దతు బీజేపీకి లభిస్తోంది. ఆర్థిక వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. పార్టీ సందేశాలను ప్రభావదాయకంగా ప్రజలలోకి తీసుకువెళ్లే సామర్థ్యం తక్కువేమీ కాదు. కనుకనే జాతీయ ప్రాధాన్యమున్న అంశాలను ఎన్నికల ప్రచారానికి చాలా నేర్పుగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడంలో బీజేపీ సదా సఫలమవుతోంది.

ఎన్నికల వ్యయాలపై ఈసీఐకి నివేదించిన వివరాల ప్రకారం, ఈ ఏడాది ఐదు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మొత్తం రూ.529.38 కోట్లు ఖర్చు చేసింది. ఆ ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ చేసిన వ్యయం రూ. 248.55 కోట్లు. బీజేపీ ఒక్క బెంగాల్‌లోనే చేసిన వ్యయం, ఐదు రాష్ట్రాలలో కాంగ్రెస్ ఖర్చు చేసిన మొత్తం కంటే ఎక్కువగా ఉన్నది. ఈసీఐ వెల్లడించిన లెక్కల ప్రకారం, బెంగాల్‌లో బీజేపీ ఎన్నికల వ్యయం రూ.286.99 కోట్లుగా ఉన్నది. ఆయా పార్టీలు చేసిన వ్యయాలు ఇంకా అధికంగా ఉంటాయనడంలో సందేహం లేదు. అయితే అవేవీ ఎన్నికలలో అక్రమాలు జరిగాయన్న విషయాన్ని రుజువు చేయలేవు. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల కాలంలోనే తమకు అందిన విరాళాలు మొత్తం రూ.1,473 కోట్లు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయం వెల్లడించింది. అదే కాలంలో కాంగ్రెస్‌కు విరాళాల రూపేణా కేవలం రూ.207 కోట్లు మాత్రమే సమకూరాయి. చెప్పవచ్చినదేమిటంటే ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి ఎలాంటి కుట్ర సిద్ధాంతాలు అవసరం లేదు. గతంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ప్రధాన ప్రతిపక్షం అధికార పార్టీతో సమానంగా సమర్థ యంత్రాంగాన్ని ఎందుకు నిర్మించుకోలేకపోయింది? ఈ ప్రశ్నను రాహుల్‌గాంధీ ఎదుర్కోవాలి.

కాంగ్రెస్‌కు వాటిల్లిన సమస్యలన్నిటికీ ఈసీఐని తప్పుపట్టడం ఎంతమాత్రం వివేకం కాదు. నాయకత్వ తగాదాలు, సంస్థాగత క్షీణత, ముఠాల కుమ్ములాటలు, ఫిరాయింపులు, బలహీనపడిన పీసీసీలు మొదలైనవన్నీ కాంగ్రెస్ స్వయంకృతాలే కానీ ఈసీఐ ప్రమేయంతో జరిగినవి కావు కదా. ఇదిగో ఇక్కడే ప్రభుత్వ వ్యతిరేకత అనే వాదన మరింత ఆసక్తికరమవుతోంది. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఉంది. అదొక వాస్తవం. 2018లో మూడు హిందీ రాష్ట్రాలలో బీజేపీని కాంగ్రెస్ ఓడించింది. 2023లో కర్ణాటకలో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ కనీస మెజారిటీని కూడా సాధించుకోలేకపోయింది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మిత్రపక్షాలపై ఆధారపడడం అనివార్యమయింది. భారతీయ ఓటర్లు అధికారంలో ఉన్నవారిని శిక్షిస్తారని, శిక్షించగలరని ఈ జయాపజయాలు స్పష్టం చేస్తున్నాయి. మోదీపై ప్రభుత్వ వ్యతిరేకత ఎందుకు పనిచేయడం లేదు? ప్రతిపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను ఒక సుస్థిర జాతీయ ప్రత్యామ్నాయంగా ఎందుకు మార్చలేకపోతున్నాయి? మొదటిదానికంటే రెండోదే మరింత ఆసక్తికరమైన ప్రశ్న. ఈ రెండు ప్రశ్నల మధ్య ఉన్న తేడా చాలా ముఖ్యమైనది.

బీజేపీని ఎన్నికల్లో ఓడించడం అసాధ్యం కావచ్చు కానీ ప్రతిపక్షాలు ఆ పార్టీని రాజకీయంగా ఎందుకు ఎదుర్కోలేకపోతున్నాయి, సులభంగా ఎందుకు ఓడిపోతున్నాయని కాంగ్రెస్ తప్పక ప్రశ్నించుకోవాలి. నైరాశ్యానికి లోనవుతూ దాన్ని అధిగమించడానికి ప్రయత్నించకపోతే ఎలా? ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పన్నెండేళ్లకు పైగా దేశాన్ని పరిపాలిస్తున్నారు. రాజకీయ అలసట, అసంతృప్తి, బలహీనతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాలకు ఇదొక రాజకీయ అవకాశం. అయితే రాజకీయ అవకాశమే రాజకీయ విజయానికి రాచబాట వేయదు. ప్రభుత్వ వ్యతిరేకత అయితే ఉన్నది. దానిని ఓట్లు, సీట్లుగా మార్చడానికి ఒక సువ్యవస్థిత రాజకీయ వేదిక అవసరం.

మళ్లీ రాహుల్‌గాంధీ వద్దకు వెళదాం. తన ప్రశ్నలకు ఈసీఐ సమాధానాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేయడం సమంజసమే. ఎన్నికల సంఘానికి, ఆ మాటకు వస్తే ఏ రాజ్యాంగ సంస్థకు అయినా పారదర్శకత, జవాబుదారీతనం, సంస్థాగత విశ్వసనీయత ఉండడం అవసరం. ఓటర్ల జాబితాపై రగులుతున్న వివాదం స్పష్టం చేస్తున్నదేమిటి? ఈసీఐ తన విధులను మరింత పారదర్శకతతో నిర్వహించాలనే కాదూ? సర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని సంపూర్ణంగా వెల్లడించాలి. దానిని స్వతంత్ర వ్యక్తులు, సంస్థలు పరిశీలించి నిగ్గు తేల్చాలి. ఇది తప్పనిసరి.

ఈసీఐ ప్రమేయం కీలకంగా లేని ప్రాంతాలలో కాంగ్రెస్ పరాజయం పాలయింది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు ఘనమైన ఎన్నికల విజయాలు లభించాయి. ఎన్నికల మధ్యవర్తి–– అంటే ఈసీఐ తన విధులు సక్రమంగా నిర్వర్తించనందునే బీజేపీ అసాధారణ విజయాలు మూటగట్టుకుందని విమర్శించడం సబబుకాదు. ఈసీఐ కంటే బాగా సహాయకారి అయిన రాజకీయ, సంస్థాగత, సైద్ధాంతిక, నాయకత్వ కారణాలు బీజేపీ విజయాల వెనుక ఉన్నాయి. ఈ వాస్తవాన్ని విపక్షాలు విస్మరించకూడదు.

మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



# ఎస్‌జీఎఫ్ తైక్వాండో జిల్లా జట్ల ఎంపిక

- గద్వాలలో జరిగే ఉమ్మడి జిల్లా పోటీలకు 35 మంది విద్యార్థుల ఎంపిక

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో అక్టోబర్ 4 మీ వార్త :

**వనపర్తి టౌన్ న్యూస్ :** వనపర్తి యాదవ కమిటీ హాల్‌లో ఆదివారం ఎస్‌జీఎఫ్ వనపర్తి జిల్లా తైక్వాండో ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ నెల 8న గద్వాలలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ బొలెమోని కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైక్వాండో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసంతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందిస్తుందని అన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత విద్యలో, ఉద్యోగ అవకాశాల్లో స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. తైక్వాండోలో ప్రతిభను మెరుగుపరుచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేసేందుకు తైక్వాండో నైపుణ్యాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. జిల్లా తైక్వాండో జనరల్ సెక్రటరీ కంద్రేని వెంకటేష్, అధ్యక్షుడు జి.స్వామి, టెక్నికల్ చైర్మన్ డబ్బి యుగంధర్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు దయానంద్, వహీద్, తైక్వాండో సీనియర్ విద్యార్థులు పరశురాం, వి.శివ, రవి, ఈశ్వర్, ఆర్‌బీఆర్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్, రేడియంట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



అండర్-14 బాలికల విభాగంలో కె.విశ్వతేజ, ఇ.సాయి అభినందన, కె.అమూల్య, కె.వైష్ణవి, పి.ఆకాంక్ష, ఆర్.ఝాన్సీరాణి, ఈ.ఉషారాణి ఎంపికయ్యారు.
అండర్-14 బాలుర విభాగంలో జి.అర్జున్, ఎం.సౌమిత్, పి.యోగేష్, యు.సాయి సాత్విక్, సి.మంజునాథ్, ఎస్.రాజేష్, ఎన్.రోహిత్, ఏ.యశ్వంత్ ఎంపికయ్యారు.
అండర్-17 బాలుర విభాగంలో ఎం.విగ్నేష్, ఎం.లోహిత్, ఎస్.రాజు, ఎస్.భానుతేజ్, యు.వివేక్ సాగర్ ఎంపిక కాగా, అండర్-17 బాలికల విభాగంలో కె.అమృత, పి.విజయశ్రీ, డి.సుకృత, బి.ఆదిత్యశ్వరి, కె.పావని, జే.మానస, ఆర్.కినిషా, వై.హాసిని, టి.నిహారిక, కె.జావలి ఎంపికయ్యారు.
జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ నెల 8న గద్వాలలో జరిగే ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీల్లో వనపర్తి జిల్లా తరఫున పాల్గొననున్నారు...

# ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణి







- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- ఉప్పల్ ఎమ్మెల్యే చేతుల మీదగా అందజేత

ఉప్పల్, అక్టోబర్ 4 ( మన మీ వార్త):

జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డి ల ఆధ్వర్యంలో గ్రూప్ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథి గా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి విచ్చేసి ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన పలువురు జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ బాండ్లను ఎమ్మెల్యే చేతుల మీదగా అందజేశారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి ఆర్థిక సాయంతో జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, వారి సంక్షేమం, భద్రత కు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమం లో గుడి మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు,నేర్ధం భాస్కర్ గౌడ్, నాయకులు ఈరెల్లి రవీందర్ రెడ్డి,తిరుమలేష్,కొంపల్లి రవీందర్,పల్లె రాజకుమార్ గౌడ్,గడ్డం పాపి రెడ్డి,పిట్టల నరేష్,ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్,ప్రధాన కార్యదర్శి నర్సింహా రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా సీసా నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ బోడ ప్రవీణ్, ఇడపాక సురేష్, కమిటీ సభ్యులు వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి పథకానికి 12 ఏళ్లు..కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మహిళలు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 4 ( మన మీ వార్త):

'కళ్యాణ లక్ష్మి' పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో మహిళా సోదరీమణులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని మహిళలతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా వివాహ సమయంలో ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం అందడంతో పేద కుటుంబాలకు ఎంతో ఊరట



లభించిందన్నారు. ఆడబిడ్డల సంక్షేమం, మహిళల గౌరవం, పేద కుటుంబాల ఆర్థిక భద్రత కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఈ సందర్భంగా మహిళలు గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు అందిన సహాయాన్ని గుర్తు



చేసుకుంటూ మహిళలు నిర్వహించిన కార్యక్రమం అభినందనీయమన్నారు. ఆడబిడ్డల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాల ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సోదరీమణులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిలుకానగర్ లో కలుషిత తాగునీటిపై బీజేపీ ఆగ్రహం

## మంచినీటి గేట్ వాల్వ్‌లకు తక్షణ మరమ్మతులు చేయాలి: సంఘీ స్వామి యాదవ్

చిలుకా నగర్, అక్టోబర్ 4 ( మన మీ వార్త ):

చిలుకనగర్ డివిజన్‌లో కలుషిత మంచినీరు, రోడ్ల పక్కన పేరుకుపోయిన డ్రైనేజీ వ్యర్థాలు, మంచినీటి గేట్ వాల్వ్‌ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చిలుకానగర్ డివిజన్ బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి, మల్లికార్జున్ నగర్ కాలనీ మాజీ అధ్యక్షులు, భాగ్యనగర్ ఉత్సవ సమితి సిల్కానగర్ శాఖ మాజీ కన్వీనర్ సంఘీ స్వామి యాదవ్ జలమండలి, మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. చిలుకనగర్‌లోని విజ్ఞాన్ స్కూల్ చౌరస్తాతో పాటు పలు ప్రాంతాల్లో మంచినీటి గేట్ వాల్వ్‌లు సరిగా పనిచేయకపోవడంతో డ్రైనేజీ వ్యర్థాలు, మురుగునీరు మంచినీటి పైప్‌లైన్లలో కలుస్తున్నాయని ఆయన ఆరోపించారు. కలుషిత నీటిని వినియోగించడం వల్ల స్థానిక ప్రజలు, చిన్నారులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా, డ్రైనేజీలను శుభ్రం చేసిన అనంతరం తొలగించిన వ్యర్థాలను రోడ్ల పక్కనే కుప్పలుగా వదిలేస్తున్నారని తెలిపారు. వాటిని సకాలంలో తొలగించకపోవడంతో వర్షపు నీటితో కలిసి కాలుష్యం, దుర్గంధం ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.
ఈ సమస్యలను జలమండలి, మున్సిపల్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడంతో పాటు ఫోన్ ద్వారా



కూడా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సరైన స్పందన, పరిష్కారం లభించలేదని స్వామి యాదవ్ అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం



చేశారు.
తక్షణమే మంచినీటి గేట్ వాల్వ్‌లను మరమ్మతు చేసి, రోడ్ల పక్కన పేరుకుపోయిన డ్రైనేజీ వ్యర్థాలను తొలగించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే చిలుకనగర్ బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో కలిసి ఉప్పల్ జలమండలి కార్యాలయం ఎదుట భారీ ధర్నా, ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

# ప్రభుత్వ జనరల్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమం
- 22వ వార్డు ఏరువ అరుణ మెకానిక్ శ్రీను

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో అక్టోబర్ 4 మీ వార్త :

**వనపర్తి టౌన్ న్యూస్ :** మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వనపర్తి ప్రభుత్వ జనరల్ ఏరియా





ఆసుపత్రిలో సేవా కార్యక్రమం నిర్వహించారు. 22వ వార్డు కౌన్సిలర్ ఏరువ అరుణ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా అవసరంలో ఉన్న వారికి చేయూతనిచ్చే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మెకానిక్ శ్రీను, గౌనికాడి యాదయ్య, వజ్రాల రమేష్, మిత్రబృందం సభ్యులు, 22వ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

# కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్‌లో జానపద గాయకుడు నరేందర్ గౌడ్‌కు గుర్తింపు

- సుస్వరాభిషేకం'లో సొంత పాటలతో అలరించిన చర్లపల్లి కళాకారుడు
- 111 మంది గాయకులు.. 111 పాటలు.. నరేందర్ గౌడ్‌కు ప్రత్యేక ప్రశంస
- గాత్రంతో ఆకట్టుకున్న జానపద గాయకుడికి సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేత

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో అక్టోబర్ 4 మీ వార్త :

**కొత్తకోట న్యూస్ :** కొత్తకోట మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన జానపద గాయకుడు వై. నరేందర్ గౌడ్కు అరుదైన గుర్తింపు లభించింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో అంజలి మీడియా గ్రూప్--అందరి టీవీ







ఆధ్వర్యంలో నిర్వహించిన "సుస్వరాభిషేకం--111 మంది గాయకులు, 111 పాటలు" కార్యక్రమంలో పాల్గొన్న నరేందర్ గౌడ్ తనదైన గాత్రంతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో నరేందర్ గౌడ్ తన సొంత పాటలను ఆలపించి జానపద సంగీతంపై తనకున్న ప్రతిభను చాటుకున్నారు. ఆయన గాత్రానికి నిర్వాహకుల నుంచి ప్రత్యేక ప్రశంసలు లభించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు గుర్తింపుగా నిర్వాహకులు ఆయనకు కాకతీయ బుక్ ఆఫ్ నేషనల్ రికార్డ్స్ సర్టిఫికెట్, జ్ఞాపికతో పాటు ప్రత్యేక అభినందన పోస్టర్, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చర్లపల్లి గ్రామానికి చెందిన నరేందర్ గౌడ్ జానపద గాయకుడిగా కొనసాగుతూ తన పాటల ద్వారా గ్రామీణ కళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో తన ప్రతిభను ప్రదర్శించి రికార్డు గుర్తింపు పొందడం పట్ల గ్రామస్థులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై నిర్వహించే తమ కార్యక్రమాల్లోనూ నరేందర్ గౌడ్ పాల్గొని మరిన్ని పాటలు ఆలపించాలని నిర్వాహకులు కోరారు. ఈ గుర్తింపు తనకు మరింత ప్రోత్సాహాన్ని అందించిందని, జానపద కళకు మరింత సేవ చేయాలనే ఉత్సాహాన్ని కలిగించిందని నరేందర్ గౌడ్ పేర్కొన్నారు...

# ములుగు జిల్లా.ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.
- జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం.

మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.



సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ములుగు ఆర్డీవో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.
జిల్లా పరిధిలో జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి నిర్వహించాలని ఈ ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

## వంచనగిరిలో మృతుల కుటుంబాలకు కొండా సురేఖ పరామర్శ --- అండగా ఉంటామని భరోసా

మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:




వంచనగిరి: వంచనగిరి గ్రామంలో మృతి చెందిన బొల్లం కొమురెల్లి గారి పార్థివదేహానికి మాజీ మంత్రి కొండా సురేఖ గారు నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అదేవిధంగా అనారోగ్యంతో మృతి చెందిన కొండా కొమురమ్మ గారి కుటుంబాన్ని కూడా కొండా సురేఖ పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో కొండా కుటుంబం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని కొండా సురేఖ తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వి.పి గౌతమ్, I A S.

మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:



కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ గౌతమ్ గారికి అర్చకులు అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రములు బహుకరించి ప్రసాదములు అందజేశారు..రామల సునీత కార్యనిర్వహణాధికారి.

## ఓం చాముండేశ్వరి ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని,KUDA చైర్మన్...

మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:



వరంగల్‌లో దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని హంటర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ముఖ్య



అతిథులుగా హాజరై ప్రారంభించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఖుఖణూ చైర్మన్ గుండు సుధారాణి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం నిర్వాహకులు ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో ప్రజలను ఆకర్షించేలా, వారికి ఉపయోగపడేలా ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి చూడలేని ప్రముఖ దేవాలయాలు, ప్రత్యేక నిర్మాణాలు, వివిధ ప్రదర్శనలు, వినూత్న కార్యక్రమాలను వరంగల్‌లోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు.

ఈసారి కూడా ఎగ్జిబిషన్‌ను ఎంతో చక్కగా, ఆకర్షణీయంగా మిరియాల వేణు, శ్రీకాంత్, వరుణ్, గోపి, ఫిరోజ్ రూపొందించారని ఎమ్మెల్యే ప్రశంసించారు. ప్రజలకు ఆహ్లాదంతో పాటు ప్రత్యేక అనుభూతిని అందించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తూ, ఎగ్జిబిషన్ విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.

ఈ వేడుకలో మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు,వేల్పుల మోహన్ రావు,డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,మాజీ అధ్యక్షులు సురేందర్,నాయకులు సురేష్,వరుణ్, వేణు మరియు నిర్వాహకులు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## గోమారంలో లడ్డు వేలం కు పోటీ

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (4):

మండల పరిధిలోని గోమారం గ్రామంలో ఆదివారం భగత్‌సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలు ఆసక్తికరంగా సాగాయి.గ్రామానికి చెందిన గుంతి రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి రూ.1.85 లక్షలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో పలికిన ధర గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి,సర్పంచ్ హైమావతి ఆంజనేయులు, ఉపసర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ఆరబోసిన జొన్నలపై అదుపుతప్పి కిందపడ్డ వాహనం -వ్యక్తికి గాయాలు

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (4):




రోడ్డుపై ఆరబోసిన సాయిజొన్నలపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడడంతో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం గోమారం శివారులో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామానికి చెందిన పిట్టల కాశయ్య (60) ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకునేందుకు గోమారం గ్రామానికి వెళ్లాడు.పని ముగించుకుని టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై తిరిగి సికింద్లాపూర్‌కు బయలుదేరాడు.
గోమారం శివారులో రోడ్డుపై సాయిజొన్నలను ఆరబోసి ఉంచడంతో వాటిని గమనించని కాశయ్య వాహనం జొన్నలపైకి వెళ్లి అదుపుతప్పి కిందపడిపోయాడు.ఈ ఘటనలో కాశయ్యకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రోడ్డుపై పంటలను ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని,సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# లివర్ వ్యాధులపై అప్రమత్తత అవసరం - క్లినికల్ డైరెక్టర్,

- కాలేయ సంబంధిత డాక్టర్ నవీన్ పోలవరపు
-ఫ్యాటీ లివర్, హెపటైటిస్‌తో క్యాన్సర్ ప్రమాదం: పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్
- ముందస్తు పరీక్షలతో ప్రాణాలు కాపాడుకోవచ్చు.!

మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి హనుమకొండ, అక్టోబర్ 04 :




ప్రపంచవ్యాప్తంగా శర వేగంతో పెరుగుతున్న క్యాన్సర్లలో లివర్ క్యాన్సర్ ఒకటిగా మారుతోందని యశోద హాస్పిటల్ హైటెక్ సిటీకి చెందిన క్లినికల్ డైరెక్టర్, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, లివర్ వ్యాధుల నిపుణుడు డాక్టర్ నవీన్ పోలవరపు, పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్ తెలిపారు. హనుమకొండలో ప్రత్యేక విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం క్లినికల్ డైరెక్టర్, డాక్టర్ నవీన్ పోలవరపు మాట్లాడుతూ 'నిశ్శబ్ద హంతకులు'గా ఫ్యాటీ లివర్, హెపటైటిస్ బి, సి వైరస్ లు వస్తున్నాయని అన్నారు. అధిక మద్యపానం వల్ల లివర్ తీవ్రంగా దెబ్బతింటోందని, ముదిరి పోయే వరకు వ్యాధి లక్షణాలు బయట పడక చాలామందికి తెలియదని వారు హెచ్చరించారు.

కాళ్లు వాపులు, పొట్ట ఉబ్బరం, లివర్ క్యాన్సర్ వంటి లక్షణాలు ఆలస్యంగా వెలుగులోకి వస్తాయని వైద్యులు వెల్లడించారు.

క్రమం తప్పకుండా రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవడం ద్వారా ముందస్తుగానే వ్యాధిని గుర్తించి వ్యాక్సినేషన్, సరైన చికిత్సలతో ప్రాణాపాయాన్ని తగ్గించవచ్చని సూచించారు.

కొలెస్ట్రాల్, మధుమేహం, థైరాయిడ్ సమస్యలను అదుపులో ఉంచుకోవాలని, మద్యపానం మానడం లేదా తగ్గించడం ద్వారా లివర్, ప్యాంక్రియాస్ దెబ్బతినకుండా కాపాడుకోవచ్చని వారు తెలిపారు. పాంక్రియాస్ స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ భరద్వాజ్ పెగట్రాజ్ మాట్లాడుతూ అనారోగ్యకరమైన ఆహార అలవాట్ల వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలు పెరుగుతున్నాయని, మలవిసర్జనలో మార్పులు, రక్తస్రావం, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలు రెండు వారాలకు మించి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

కొలనోస్కోపీ పరీక్ష ద్వారా పేగుల్లో ఏర్పడే పాలిప్స్‌ను తొలిదశలోనే గుర్తించి తొలగించడం వల్ల పెద్దపేగు క్యాన్సర్‌ను నివారించవచ్చని వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) 2030 నాటికి హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ సిబ్బంది విజయ్ కుమార్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ ఎస్ ఎల్ ఈస్ట్ కౌంటీలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం





- జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మాట్రిక్స్ హాస్పిటల్స్ సహకారంతో

ఉప్పల్, అక్టోబర్ 4 ( మన మీ వార్త):

ఎన్ఎస్ఎల్ ఈస్ట్ కౌంటీ నివాసితుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో, రామంతపూర్ మ్యాట్రిక్స్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.శిబిరానికి ఎన్ఎస్ఎల్ ఈస్ట్ కౌంటీ నివాసితులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్ కన్సల్టేషన్, దంత పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్ష (బీఎండ్ ), కిడ్నీ, థైరాయిడ్ పరీక్షలతో పాటు రక్తపోటు, షుగర్, రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు.

కార్యక్రమం విజయవంతం కావడంలో ఎన్ఎస్ఎల్ ఈస్ట్ కౌంటీ చైర్మన్ సురేంద్ర మూటాల, జనరల్ సెక్రటరీ సంతోష్, ట్రెజరర్ నాగు శ్రీధర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు డా. భువన ఆనంద్ రావు, రామకృష్ణ, శ్రీనివాస్ సాగర్, కొమ్ము పద్మ తదితరులు చురుకుగా పాల్గొన్నారు.అలాగే శిబిరం ప్రారంభం నుంచి ముగింపు వరకు నివాసితులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయం చేసిన శ్రీకాంత్ రెడ్డి, చిట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పడాల శ్రీకాంత్, రామకృష్ణ రెడ్డి, రవిశంకర్, ఉదయ్, ప్రసాద్ బలసాని, కొండల్రెడ్డి, సుకుమార్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సీఏ వెంకట్రావు, భాస్కర్ తదితరులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.నివాసితుల ఆరోగ్య ప్రయోజనం కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు సహకరించిన జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, మ్యాట్రిక్స్ హాస్పిటల్స్ రామంతపూర్ యాజమాన్యం, వైద్యులు, మెడికల్ టీమ్‌కు ఎన్ ఎస్ ఎల్ ఈస్ట్ కౌంటీ చైర్మన్, మేనేజ్‌మెంట్ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."ఆరోగ్యకరమైన, ఆనందకరమైన ఎన్ఎస్ఎల్ ఈస్ట్ కౌంటీ కోసం అందరం కలిసి ముందుకు సాగుదాం" అని నిర్వాహకులు పేర్కొన్నారు.

# తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి వరంగల్ కె. మనోహర్

మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:

- నర్సంపేటలో 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు




తూనికలు, కొలతల విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి కె. మనోహర్ హెచ్చరించారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని చేపలు, చికెన్, మాంసం, పండ్ల దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ధ్రువీకరణ చేయించుకోకుండా, శాఖ ముద్రలు వేయించుకోకుండా వినియోగిస్తున్న 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యాపారులందరూ తమ తూకపు యంత్రాలు, ఇతర కొలతల పరికరాలను నిర్ణీత గడువులోగా తనిఖీ చేయించి అధికారిక ముద్రలు వేయించుకోవాలని సూచించారు. వినియోగదారులకు సరైన తూకంతో సరుకులు అందించాలని, తూకాల్లో మోసాలకు పాల్పడితే తూనికలు, కొలతల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు సందర్భంగా తూకాలను పరిశీలించాలని సూచించారు.

# నాచారం, హెచ్‌ఎంటీ నగర్ డివిజన్ లలో కోటి రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం, అక్టోబర్ 4 (మన మీ వార్త):




నాచారం, హెచ్‌ఎంటీ నగర్ డివిజన్లలో సుమారు కోటి రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ఈ పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.సాయినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి రూ.9 లక్షలు, శ్రీ రాఘవేంద్ర నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి రూ.13 లక్షలు, కౌండిన్య నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.33.8 లక్షలు, భవాని నగర్‌లో మిగిలిన సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.47.8 లక్షలు, రాఘవేంద్ర నగర్‌లోని శివ నర్సింగ్ హోమ్ వెనుక వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.20 లక్షల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు.మంజూరైన పనులను ప్రారంభించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, స్థానిక నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్‌లతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాచారం, హెచ్‌ఎంటీ నగర్ డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన డ్రైనేజీ, మంచినీరు, రహదారి సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డి. సాయి పృథ్వీ, ఏఈ సూరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు విజయ్ కుమార్, రామారావు, జలమండలి మేనేజర్



రోహిత్‌తో పాటు సాయినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ రాఘవేంద్ర నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కౌండిన్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, భవాని నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నాచారం, హెచ్‌ఎంటీ నగర్ డివిజన్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## లోవోల్టేజీ సమస్యపై గుండ్లపల్లి రైతుల ఆందోళన

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (4):**



లో వోల్టేజ్ సమస్యకు నిలిచిపోయిన విద్యుత్ తో భర్తీ చేయాలంటే డిమాండ్ చేస్తూ గుండ్లపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో లోవోల్టేజీ సమస్య కారణంగా విద్యుత్ సరఫరా తరచూ ట్రిప్ అవుతుండడంతో అంతరాయం కలిగిన విద్యుత్ ను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సబ్ స్టేషన్ ముందు రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్ లోవోల్టేజీ కారణంగా నిలిచిపోతున్న సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.రైతులు మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో లోవోల్టేజీ సమస్య ఏర్పడి సరఫరా నిలిచిపోయిన సమయాన్ని తిరిగి అదనపు సరఫరా ద్వారా భర్తీ చేయాలని కోరారు.విద్యుత్ సరఫరా అంతరాయం కారణంగా పంటలకు నీరు అందించలేక నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.లోవోల్టేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.ఈ విషయాన్ని ఏఈ నరేందర్ దృష్టికి తీసుకెళ్లగా, లోడ్ ఎక్కువైన సమయంలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా భర్తీ చేసేందుకు తమ పరిధిలో లేదని,సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపినట్లు రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెంజర్ల నర్సింలు,సత్యనారాయణ, సత్తయ్య,నర్సారెడ్డి, మల్లారెడ్డి ఉన్నారు.

## హనుమకొండ నేడు (సోమవారం) ప్రజావాణి కార్యక్రమం

**మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి అర్జీల స్వీకరణ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో, హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు కలెక్టర్ ప్రకటనలో తెలియజేశారు.

## వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జిల్లా కలెక్టర్

**మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:**



ఉదయం 10.00 గంటల నుండి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా పరిధిలో జిల్లా స్థాయి అధికారులు రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ డివిజన్ అధికారులు మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి నిర్వహిస్తారని, ఈ ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన ద్వారా తెలిపారు.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## అసహజ మరణాలపై ఉద్యమం

- బొల్లం కృష్ణ నివాళి కార్యక్రమంలో జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటీ.

**జవహర్ నగర్ , అక్టోబర్ 4: (వార్త ప్రతినిధి) :**



ఇటీవల జవహర్ నగర్ డంపింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అనారోగ్యాలతో చనిపోతున్న వారి సంఖ్య రోజురోజుకు తీవ్రస్థాయిలో ఉన్నాయని, ఇలాంటి మరణాలన్ని రాంకీ చెత్త డంపింగ్ వలన పరోక్షంగా జరుగుతున్న హత్యలేనని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీలోని జేఏసీ బాగస్వామ్య సంస్థలకు చెందిన నేతలు స్పష్టం చేశారు. ఇలాంటి అసహజ మరణాలపై సమిష్టిగా చర్చించి, త్వరలో వీటిపై ప్రజలను చైతన్య పరచడానికి స్పష్టమైన కార్యచరణ రూపొందించుకొని, ప్రజా ఉద్యమ నిర్మాణానికి పూనుకుంటామని జేఏసీ తెలిపింది.

కీసరసర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ, గబ్బిలాలపేట, వైయస్సార్ నగర్ లో డంపింగ్ యార్డు ప్రభావం వలన సెప్టెంబర్-26న అనారోగ్యంతో మరణించిన బొల్లం కృష్ణ నివాళి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బొల్లం కృష్ణా లాంటి మరణాలు సంభవించకుండా యుద్ధ ప్రాతిపదికన డంపింగ్ యార్డు నుండి వెలువడే విషవాయులను వెంటనే నివారించాలని, ఈప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించి, మంచినీటి సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా బొల్లం కృష్ణ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు.

జేఏసీ చైర్మెన్ షేక్ షావలి, కో కన్వీనర్స్ సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం సదానందం, పిఓడబ్ల్యూ(విముక్తి). గడిపె సునీత, జర్నలిస్ట్ కొన్నెవేణు, శారదా, సిఎంఎస్ రాష్ట్ర కన్వీనర్ జ్యోతి, కార్యవర్గ సభ్యులు శ్రీదేవి, సిటి కమిటీ వసంత, అల్లూరి సావిత్రి తదితరులు పేర్కొన్నారు.

# మున్సిపల్ నీటి ట్యాంక్ వ్యక్తిగత పనులకు వినియోగించారా?

- ప్రజలకు నీటి కష్టాలు మున్సిపల్ వనరులు వ్యక్తిగత అవసరాలకా?
- అనుమతులు ఉంటే బయటపెట్టండి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోండి
- మున్సిపల్ ట్యాంకర్ వినియోగంపై రికార్డులు బహిర్గతం చేయాలి
- ప్రజల ఆస్తులు ప్రజల కోసమే వినియోగించాలి బత్తిని మధు
- విచారణ జరిపి వాస్తవాలు తేల్చాలి: బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తిని మధు

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో అక్టోబర్ 4 మీ వార్త వనపర్తి టౌన్ న్యూస్ :**



వనపర్తి పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలు తాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో మున్సిపాలిటీకి చెందిన నీటి ట్యాంక్‌ను వ్యక్తిగత అవసరాలకు వినియోగించారనే ఆరోపణలు రావడంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు బత్తిని మధు డిమాండ్ చేశారు.మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం కృష్ణ వ్యక్తిగత పనులకు మున్సిపల్ నీటి ట్యాంక్‌ను వినియోగించుకున్నారనే ఆరోపణలపై అధికారులు వాస్తవాలను నిగ్గు తేల్చాలని ఆయన కోరారు. ప్రజలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన మున్సిపల్ వనరులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకునేందుకు అనుమతి ఇచ్చారా? ఇచ్చి ఉంటే ఏ నిబంధనల ప్రకారం అనుమతి ఇచ్చారు? అనుమతి ఎవరు ఇచ్చారు? అనే అంశాలను అధికారులు ప్రజలకు స్పష్టం చేయాలని అన్నారు.వనపర్తి మున్సిపాలిటీ పరిధిలో 33 వార్డులు, 15,891 డొమెస్టిక్ వాటర్ ట్యాపులు, 125 పబ్లిక్ వాటర్ ట్యాపులు, 31 వాటర్ రిజర్వాయర్లు ఉన్నట్లు అధికారిక జిల్లా వెబ్‌సైట్‌లో పేర్కొన్న విషయాన్ని బత్తిని మధు ప్రస్తావించారు. ఇంతటి ప్రజా అవసరాలకు సంబంధించిన నీటి వ్యవస్థలోని వనరుల వినియోగంపై పూర్తి పారదర్శకత ఉండాల్సిన అవసరం ఉందన్నారు.ఒకవైపు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు మున్సిపల్ వనరులు వ్యక్తిగత పనులకు వినియోగించారనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వినియోగానికి అధికారిక అనుమతి ఉందా? ఉంటే ఆ అనుమతి పత్రాలను ప్రజల ముందు ఉంచాలి" అని బత్తిని మధు డిమాండ్ చేశారు.మున్సిపల్ నీటి ట్యాంకర్ లేదా వాహనం ఎప్పుడు, ఎక్కడ, ఎవరి ఆదేశాల మేరకు వినియోగించబడిందనే వివరాలతో పాటు సంబంధిత రికార్డులు, లాగ్‌బుక్, అనుమతులు, అధికారుల ఆదేశాలు, వినియోగానికి సంబంధించిన ఇతర పత్రాలను పరిశీలించాలని కోరారు.మున్సిపల్ ఆస్తులు, నీటి వనరులు ప్రజల అవసరాల కోసం ఉద్దేశించినవని, వాటిని వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించేందుకు అనుమతి ఉంటే అందుకు సంబంధించిన నిబంధనలు, అధికారిక ఉత్తర్వులను అధికారులు వెల్లడించాలని అన్నారు. ఆరోపణలు విచారణలో నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు నీరు అందించడం మున్సిపాలిటీ బాధ్యత. ప్రజల కోసం ఉన్న వనరులు ప్రజల అవసరాలకే వినియోగించాలి. ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలి" అని బత్తిని మధు పేర్కొన్నారు.

# లైసెన్స్ ఉంది... లేదంటూ తప్పుడు ప్రచారం ఎందుకు?

- బుద్దారం కల్లు సొసైటీపై వివాదం... 200 కుటుంబాల జీవనాధారాన్ని దెబ్బతీయొద్దు
- లైసెన్స్ పత్రాలు పరిశీలించి వాస్తవాలు తేల్చాలి
- ఎన్నికలు నిర్వహించాలి...ఎక్సైజ్ అధికారులకు గీత కార్మికుల విజ్ఞప్తి
- ఇరువర్గాల వాదనలు విని నిర్ణయం తీసుకోవాలని డిమాండ్

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో అక్టోబర్ 4 మీ వార్త :**



గోపాల్పేట మండలం బుద్దారం న్యూస్: బుద్దారం గ్రామంలోని కల్లు సొసైటీ లైసెన్స్ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. సొసైటీకి లైసెన్స్ లేదంటూ కొందరు చేస్తున్న ప్రచారం అవాస్తవమని గీత కార్మికులు ఖండించారు. తమ వద్ద సొసైటీకి సంబంధించిన లైసెన్స్ పత్రాలు ఉన్నాయని, అవసరమైతే సంబంధిత అధికారులకు ఆధారాలు చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

సొసైటీకి లైసెన్స్ కలిగిన గీత కార్మికుడు ఎం. లచ్చ గౌడ్ ఏడాది క్రితం మృతి చెందడంతో, తదుపరి వ్యక్తిని ఎంపిక చేసేందుకు సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని ఎక్సైజ్ అధికారులను పలుమార్లు కలిసి కోరినట్లు గీత కార్మికులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు పది సార్లు అధికారులను కలిసి ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశామని, మెజారిటీ సభ్యులైన ఏడుగురు సభ్యుల తీర్మానం కూడా తమ వద్ద ఉందని పేర్కొన్నారు.అయితే మరో వర్గం నుంచి వరుసగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్న కారణంగా ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగడం లేదని వారు ఆరోపించారు. సొసైటీ లైసెన్స్‌ను రద్దు చేయించి, వ్యక్తిగతంగా లైసెన్స్ పొందేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలను కూడా వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వర్గం అధికారికంగా ఏమి చెబుతుందో స్పష్టత రావాల్సి ఉంది.200 కుటుంబాల జీవనాధారం,బుద్దారం కల్లు సొసైటీపై ఆధారపడి సుమారు 200 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని గీత కార్మికులు తెలిపారు. సొసైటీకి సంబంధించిన వివాదాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం మరింత జటిలం చేయకుండా, నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కోరారు. సొసైటీ లైసెన్స్ చెల్లుబాటు, సభ్యత్వం, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై ఎక్సైజ్ శాఖ స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**మత్తు పదార్థాల సరఫరాపైనా విచారణకు డిమాండ్...**

ఇదే సమయంలో తమపై ఆరోపణలు చేస్తున్న మరో వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు కల్లు తయారీలో ఉపయోగిస్తున్నట్లు ఆరోపిస్తున్న మత్తు పదార్థాలను మండలంలోని వివిధ గ్రామాల్లోని కల్లు దుకాణాలకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని గీత కార్మికులు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై కూడా ఎక్సైజ్ అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, అధికారిక విచారణ వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**ఇరువర్గాల వాదనలు పరిశీలించాలి...**

మీడియాపై తమకు పూర్తి గౌరవం ఉందని గీత కార్మికులు తెలిపారు. ఒక వర్గం చెప్పిన సమాచారాన్నే ఆధారంగా చేసుకోకుండా, ఇరువర్గాల వాదనలు, సొసైటీకి సంబంధించిన లైసెన్స్ పత్రాలు, సభ్యుల తీర్మానాలు, ఎక్సైజ్ శాఖ రికార్డులు పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.బుద్దారం కల్లు సొసైటీ వ్యవహారంలో నెలకొన్న వివాదానికి ఎక్సైజ్ శాఖ అధికారులు చట్టపరమైన పరిధిలో పరిష్కారం చూపాలని, అర్హత ఉన్న సభ్యులతో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి సొసైటీ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని గీత కార్మికులు కోరుతున్నారు. గౌడ గీత కార్మికుల మధ్య విభేదాలు మరింత పెరగకుండా అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని లైసెన్స్ వాస్తవ స్థితి, ఎన్నికల అర్హతలు, అభ్యంతరాల కారణాలు, మత్తు పదార్థాల ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు...

# వరంగల్ తూర్పు నియోజకవర్గం లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు సన్నాహక సదస్సు



**మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

ఈరోజు వరంగల్‌లోని రాజశ్రీ గార్డెన్స్‌లో వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి లిగ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ , బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ ఏనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, 2024లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో ఎన్రోల్మెంట్‌తో పాటు పోలింగ్ ప్రక్రియలో తన వెంట ఉండి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రస్తుతం కూడా 2023 నవంబర్ నాటికి డిగ్రీ, ఇంజనీరింగ్ లేదా ఇతర అర్హత కలిగిన కోర్సులు పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఎన్రోల్మెంట్ ప్రక్రియపై అవగాహన కల్పించి, అధికారిక ప్రక్రియను పూర్తి చేసుకునేలా సహకరించాలని కార్యకర్తలకు సూచించారు. అదేవిధంగా చుట్టుపక్కల ఉన్న అర్హులైన పట్టభద్రులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు కూడా సమాచారం అందించాలని కోరారు.

ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నన్నపునేని నరేందర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నన్నపునేని నరేందర్ గారు మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నియోజకవర్గంలో పటిష్టమైన సమన్వయంతో ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

- ప్రతి కార్యకర్త బాధ్యతతో ఎన్రోల్మెంట్ ప్రక్రియ పూర్తి చేయాలి .
- ప్రతి డివిజన్‌కు ఒక ఇన్‌చార్జిని నియమించాము
- ప్రతి 100 మంది పట్టభద్రులకు ఒక ఇన్‌చార్జిని కేటాయించడం జరిగింది
- ప్రతి డివిజన్‌లో ఎన్రోల్మెంట్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి.
- అర్హులైన పట్టభద్రులు అధికారిక నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా డివిజన్లో హెల్ప్ డెస్క్ ధర ప్రక్రియను పూర్తి చేయాలి
-
- ప్రతి కార్యకర్త తన పరిధిలోని





పట్టభద్రులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలి.

- ఎవరి బాధ్యత వారే పూర్తి చేసేలా బాధ్యతలను స్పష్టంగా విభజించాము
- ప్రతిరోజూ జరిగిన పని, ఇంకా పూర్తి చేయాల్సిన పనిపై సమీక్ష నిర్వహిస్తాము
- ఏమైనా ఎన్రోల్మెంట్‌లో ఎదురయ్యే సమస్యలను వెంటనే నియోజకవర్గ స్థాయి సమన్వయ బృందం దృష్టికి తీసుకురావాలి.
- చివరి తేదీ వరకు వేచి ఉండకుండా మేము ఇచ్చిన ప్రాణాలిక ప్రకారం ముందుగానే ఎన్రోల్మెంట్ పూర్తి చేయాలి.
- సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని ధృవీకరించుకున్న తర్వాతే షేర్ చేయాలి.
- అవసరమైన చోట అదనపు కార్యకర్తలను, టీమ్‌లను ఏర్పాటు చేసి పని వేగవంతం చేయాలి.
- మొత్తం నియోజకవర్గంలో ఒకే విధమైన కార్యాచరణ, సమన్వయంతో ముందుకు సాగాలి.

"ప్రతి కార్యకర్త ఒక బాధ్యత తీసుకోవాలి -- ప్రతి బాధ్యతను పూర్తి చేయాలి" అనే విధానంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఎన్రోల్మెంట్ పూర్తయ్యే వరకు ప్రతి స్థాయిలో ఫాలోఅప్ కొనసాగించాలని, నియోజకవర్గం ? డివిజన్ ? 100 మంది పట్టభద్రులకు ఒక ఇన్‌చార్జ్ ? వ్యక్తిగత ఫాలోఅప్ విధానంలో కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

ఎన్రోల్మెంట్‌కు చివరి తేదీ నవంబర్ 6 అయినప్పటికీ, అక్టోబర్ 25లోపు ప్రతి అర్హులైన పట్టభద్రుడి ఎన్రోల్మెంట్ పూర్తి చేసి, డివిజన్ వారీగా వారి వివరాలను పార్టీ కార్యాలయంలో అందజేయాలని కార్యకర్తలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు







- ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే మనందరి బాధ్యత

**మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:**

ట్రస్మా మరియు వడుప్స ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్లో నిర్వహించిన ట్రస్మా మరియు వడుప్స ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు హాజరైనారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం అభినందనీయమైన కార్యక్రమం అని అన్నారు.

అవార్డు అందుకున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, మంచి భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు అని అన్నారు. సమాజంలో వివిధ విభాగాల ఉన్నతాధికారుల కన్నా గ్రామంలో ఉన్న ఉపాధ్యాయునికి ఒక గుర్తింపు గౌరవం ఉందన్నారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తుంది అని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే మనందరి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ స్థలంలో కమిటీ హాల్ ఏర్పాటుకు సహకరిస్తానని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత అత్యధికంగా గౌరవించేది ఉపాధ్యాయులను అన్నారు.

# ఫోటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులుగా13 వ చింతల రమేష్ ఏకగ్రీవం

**చిట్యాల అక్టోబర్ 04 మీ వార్తా :**

చిట్యాల మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా 13 వ సారి సైతం చింతల రమేష్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 24 సంవత్సరాలుగా అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతున్న రమేష్ ముదిరాజ్ తిరిగి ఆయనే యూనియన్ అధ్యక్షులుగా ఎంపిక కావడం పట్ల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు మండల స్థాయిలో ఉన్న యూనియన్ను రాష్ట్ర స్థాయిలో ఉత్తమ యూనియన్ గా నిలబెట్టడంలో ఆయన చేసిన కృషి ఆమోకమని పలువురు ఫోటోగ్రాఫర్స్ కొనియాడారు ఆదివారం రోజు కోడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఆవరణలో, చిట్యాల మండల ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడం జరిగింది ఈ ఎన్నికలలో ఏకగ్రీవంగా నూతన



కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగ చింతల రమేష్ గారు, ఉపాధ్యక్షులు గా ఫోశాల రాజు(బాబా రాజు) ప్రధాన కార్యదర్శి గా కొల్లూరి అశోక్ , కోశాధికారి గా మాచర్ల సంజీవ్ ,సహాయ కార్యదర్శి గా బయగాని సందిప్ ,ప్రచార కార్యదర్శి గా గుర్రం తిరుపతి ప్రత్యేక కమిటీ మెంబర్లుగా పోశాల రాజు కట్కూరి రాజు రాజేందర్ రమేష్ సాంబయ్య కిరణ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా గత 24



సంవత్సరాల పాటు చిట్యాల మండలం ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతున్న చింతల రమేష్ ను ఫోటోగ్రాఫర్స్ శాల్వాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ ఫోటోగ్రాఫర్స్, పుల్ల రవితేజ మెరుగు మహేందర్ సత్యసాయి రాజు టేకు రవి సతీష్ జూనియర్ ఫోటోగ్రాఫర్స్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం కత్తెర గుర్తుకు ఓటు వేయండి

- ఆరు నెలల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం: రవి పటేల్

**భూపాలపల్లి అక్టోబర్ 4 మీ వార్త :**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా:** తెలంగాణ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్--తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంయుక్తంగా కత్తెర గుర్తుపై పోటీ చేస్తున్న నేపథ్యంలో భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.





తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, జిల్లా నాయకులతో కలిసి ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, టెక్నీషియన్లను కలిసి కత్తెర గుర్తుపై ఓటు వేసి బి డబ్ల్యు టి ఆర్ పి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేసి బహుజన వర్కర్స్ యూనియన్ మేనిఫెస్టోలోని ప్రధాన అంశాలను కార్మికులకు వివరించారు.

ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల ఉద్యోగ భద్రత, గౌరవం, సంక్షేమం కోసం బహుజన వర్కర్స్ యూనియన్ నిరంతరం పోరాడుతుందని అన్నారు. ముఖ్యంగా 'రిమూవల్' అనే పదాన్ని ఆర్టీసీ నుంచి శాశ్వతంగా తొలగించేలా కృషి చేస్తామని, డ్రైవర్లు, కండక్టర్ల ప్రమోషన్లలో వన్ ప్లస్ వన్ విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు బి డబ్ల్యు టి ఆర్ పి గెలిచిన ఆరు నెలల్లోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి కృషి చేస్తామని, ఇది తమ బాధ్యతగా భావిస్తున్నామని రవి పటేల్ స్పష్టం చేశారు. అలాగే కార్మికులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పాలసీ కల్పిస్తామని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని కార్మికుల ప్రయోజనాల కోసం అమలు చేయడానికి కట్టుబడి ఉంటామని రవి పటేల్ అన్నారు. గతంలో భూపాలపల్లి ఆర్టీసీ కార్మికులు సమ్మె చేపట్టిన సమయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వారి సమస్యలకు మద్దతుగా మూడు రోజుల పాటు కార్మికులతో కలిసి రోడ్డుపై కూర్చొని పోరాటం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

అదేవిధంగ టిఆర్పి అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసనమండలిలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, ప్రస్తుత కార్మికుల సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాన్ని ప్రశ్నించారని తెలిపారు. కార్మికుల సమస్యలపై నిరంతరం ప్రశ్నించే గొంతుగా తీన్మార్ మల్లన్న పనిచేస్తున్నారని అన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన ఆర్టీసీ ఉద్యోగుల భవిష్యత్తు, ఉద్యోగ భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బి డబ్ల్యు టిఆర్పి ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని రవి పటేల్ భరోసా ఇచ్చారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న బహుజన వర్కర్స్ యూనియన్కు మద్దతుగా కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని డ్రైవర్లు, కండక్టర్లు, టెక్నీషియన్లు, ఇతర ఆర్టీసీ ఉద్యోగులను ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇనుగల ప్రణయ్ రాజ్, సామల చంద్రశేఖర్, కుమార్, అరవింద్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# లంబాడి విద్యార్థి సేనలో నూతన నియామకాలు





- సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు వీరన్న నాయక్ ఆధ్వర్యంలో

**మీ వార్త అక్టోబర్ 4 సూర్యాపేట జిల్లా ప్రతినిధి :**

సూర్యాపేట జిల్లా: లంబాడి విద్యార్థి సేనను జిల్లాలో మరింత బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లా కోఆర్డినేటర్గా ధరావత్ సుమన్ నాయక్, చివ్వెంల మండల అధ్యక్షుడిగా బానోతు రమేష్ నాయక్లను నియమించారు. జిల్లా ఉపాధ్యక్షులు లకావత్ వీరన్న నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నూతన బాధ్యతలు స్వీకరించిన వారికి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుమన్ నాయక్ మాట్లాడుతూ లంబాడీలకు విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్, సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లంబాడీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. రమేష్ నాయక్ మాట్లాడుతూ మండలంలో విద్యార్థి సేనను బలోపేతం చేసి, విద్యార్థులు మరియు లంబాడీల సమస్యలపై నిరంతరం పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బానోతు హరీష్ నాయక్, రాష్ట్ర కార్యదర్శి ధరావత్ రవి నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ శివ నాయక్, బానోతు శివాజీ, రవీందర్, లక్ష్మణ్, నాగరాజు, నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దుకాణాలు కూల్చివేయడం దారుణం -- రవి పటేల్

**భూపాలపల్లి: అక్టోబర్ 04 మీవార్త :**



భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణ కాలనీ--జంగేడు రోడ్డు విస్తరణలో భాగంగా మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటున్న పూల బండ్లు, పండ్ల బండ్లు, మంగలి షాపులు, టీ దుకాణాలు, కిల్లీ కోట్లు, ఇతర చిన్న వ్యాపార సముదాయాలను కూల్చివేయడాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ తీవ్రంగా ఖండించారు.
దసరా పండుగకు ముందు చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి, వారి జీవనోపాధిని దెబ్బతీసి కుటుంబాలను రోడ్డున పడేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని రవి పటేల్ అన్నారు.

తమ జీవనోపాధిని కాపాడాలని డిమాండ్ చేస్తూ చిరు వ్యాపారులు చేపట్టిన నిరవధిక సమ్మెకు రవి పటేల్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ అవసరమే అయినప్పటికీ, ఎన్నో సంవత్సరాలుగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు చిన్న వ్యాపారాలే జీవనాధారంగా ఉన్నాయని, అలాంటి వారిని ఒక్కసారిగా రోడ్డున పడేయడం మానవత్వం కాదని అన్నారు.

చిరు వ్యాపారులకు తక్షణ పరిహారం ఇవ్వాలి

కూల్చివేతల వల్ల నష్టపోయిన ప్రతి చిరు వ్యాపారికి రూ.50 వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. అలాగే రోడ్డు విస్తరణకు సంబంధించిన రూట్ మ్యాప్ను రూపొందించి, చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించి, తిరిగి అదే ప్రాంతంలో పక్కా షాపులు నిర్మించి ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు చిరు వ్యాపారుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, వారి జీవనోపాధికి భరోసా కల్పించాలని అన్నారు.
ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని రవి పటేల్ డిమాండ్ చేశారు.
చిరు వ్యాపారులు భవిష్యత్తులో చేపట్టే ప్రతి న్యాయబద్ధమైన కార్యాచరణకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుందని రవి పటేల్ హామీ ఇచ్చారు.
అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే చిరు వ్యాపారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వి సి కె రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాలా అనిల్ కుమార్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల నాయకులు, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కేపల్లిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

- దోమల నియంత్రణకు ముందస్తు చర్యలు

**కాసిపేట, అక్టోబరు 4 (మన మీ వార్త మండల ప్రతినిధి):**



దోమల నియంత్రణ, ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా మల్కేపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు నివారణ చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సర్పంచ్ కోట్నాక రఘుపతి తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీలు, సందుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా చర్యలు చేపడుతున్నారు. దోమల వ్యాప్తి నివారణకు అవసరమైన క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తున్నారు.

ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఖాళీ కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ప్లాస్టిక్ పాత్రలు, ఇతర వస్తువుల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు. డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, దోమల నియంత్రణలో పంచాయతీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జంజిరాల సందీప్, వార్డు సభ్యులు కోడూరి విద్యాసాగర్, పర్చేకి ప్రవీణ్, సల్లూరి రూప తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బ్రదర్ షఫీ భాయ్

- పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం

**మీ వార్త అక్టోబర్ 4 సూర్యాపేట జిల్లా ప్రతినిధి :**



**సూర్యాపేట జిల్లా కేంద్రం:** వరంగల్--ఖమ్మం--నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకం భారత్ పార్టీ తరఫున అభ్యర్థిగా బ్రదర్ షఫీ భాయ్ పోటీ చేయనున్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.
"యువత మేల్కొని ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి. మీ ఓటు.. మీ భవిష్యత్తు" అని ఆయన అన్నారు. యువత, ఉద్యోగులు, విద్యావంతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.
పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6 వరకు కొనసాగుతుందని, అర్హులు ఫారం--18 ద్వారా అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడుగా

- వేముల ఆంజనేయులు ఎన్నిక

పరకాల ప్రతినిధి మన మీ వార్త :



పద్మశాలి భవన్ పరకాలలో ఆదివారం సర్వసభ్య సమావేశానికి పరకాల పట్టణ పద్మశాలి సేవా సంఘం మాజీ అధ్యక్షుడు బాసాని దయాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా డా పోతాని రాజేశ్వర్ ప్రసాద్ హజరైనారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పరకాల పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా వేముల ఆంజనేయులు తన సమీప ప్రత్యర్థి దడుంపఏటఇ నాగరాజు పై 8 ఓట్లు మెజారిటీ తో గెలుపొందారు. పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడిగా వేముల అంజనేయులు, ప్రధాన కార్యదర్శి గా చిలుకమారి మొగిలి ఎన్నికయ్యారు.

అదేవిధంగా పద్మశాలి సంఘం పరకాల పట్టణ యువజన అధ్యక్షుడిగా దాసరి రవి, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గా దేవులపల్లి సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. అధే విధంగా పరకాల పట్టణ పద్మశాలి మహిళ సంఘం అధ్యక్షురాలు గా శ్రీమతి వేముల సధారాణి, ప్రధాన కార్యదర్శి గా శ్రీమతి కడారి అమరావతి, కోశాధికారిగా శ్రీమతి దాసరి పద్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ప్రముఖ జర్నలిస్టు మెండు రవీందర్, మెరుగు శ్రీనివాస్ వ్యవహారించగా పద్మశాలి సేవా సంఘం ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు డాక్టర్ కాశయ్య , ప్రధాన కార్యదర్శి చిదురాల దేవేందర్, మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు దాసరి బిక్షపతి ట్రస్ట్ బోర్డు మెంబర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పద్మశాలి సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల సంక్షేమానికి, యువతను సంఘ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ, పద్మశాలి సమాజ అభ్యున్నతికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు పద్మశాలి సంఘం నాయకులు, సభ్యులు అభినందనలు తెలియజేశారు.

## సీఎస్ఐ బేతేలు ఆశ్రమంలో
## కోడూరి మల్లేశం 6వ వర్ధంతి వేడుకలు

- స్వర్గీయ కోడూరి మల్లేశం 6వ వర్ధంతిని పురస్కరించుకుని

పరకాల ప్రతినిధి మన మీ వార్త :



హనంకొండ జిల్లా పరకాలలోని స్థానిక సీఎస్ఐ బేతేలు ఆశ్రమంలో విద్యార్థినీ, విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆయన అభిమానులు నిర్వహించారు.

ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, మాజీ 1వ వార్డు కౌన్సిలర్, సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించిన సమయంలో మల్లేశం సార్ ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచి, వారి విద్యాభ్యాసానికి సహాయ సహకారాలు అందించిన మహానీయుడని కొనియాడారు.

అలాగే కౌన్సిలర్‌గా ఎన్నికై తన వార్డులోని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండి, ప్రజల కోసం నిరంతరం పనిచేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు బొచ్చు భాస్కర్ యూత్ కాంగ్రెస్ పరకాల మండలం ప్రధాన కార్యదర్శి సిలువేరు రాఘవలి, బొచ్చు మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు

## పెరిక కుల నాయకుడు కానుగంటి శేఖర్ మృతి:

- నివాళులర్పించిన సూరం రవీందర్

పరకాల ప్రతినిధి మన మీ వార్త :



వరంగల్ నగరానికి చెందిన పెరిక (పెతిక) కుల ప్రముఖ నాయకులు కానుగంటి శేఖర్ అకాల మరణం పట్ల జయశంకర్ భూపాలపల్లి జిల్లా పెరిక కుల సంఘం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. శేఖర్ మృతి వార్త తెలిసిన వెంటనే భూపాలపల్లి జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షుడు సూరం రవీందర్ వరంగల్‌లోని ఆయన నివాసానికి చేరుకుని, శేఖర్ భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సూరం రవీందర్ మాట్లాడుతూ.. శేఖర్ మరణం పెరిక కుల సంఘానికి, సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కుల సంఘం ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాంద్రే చిన్న రవీందర్‌తో పాటు పలువురు పెరిక కుల నాయకులు, ప్రతినిధులు పాల్గొని శేఖర్ భౌతికకాయానికి నివాళులర్పించారు.

## దసరా ఉత్సవాల సందర్భంగా
## కలెక్టర్‌ను కలిసిన దసరా ఉత్సవ కమిటీ

మన మీ వార్త అక్టోబర్ 04 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



దసరా ఉత్సవాల సందర్భంగా రాంగలీలా మైదాన్ (ఉర్సు గుట్ట), ఖరీమాబాద్‌కు చెందిన దసరా ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యక్రమాల వివరాలను కలెక్టర్‌కు కమిటీ సభ్యులు వివరించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సహకరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు.

అధ్యక్షుడు గోపాల్ నవీన్ రాజు కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, జనరల్ సెక్రెటరీ మెడిది మధుసూదన్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్న గౌడ్, సంయుక్త కోశాధికారి వెలిది శివమూర్తి, ఉత్సవ కన్వీనర్ వొడ్నాల నరేందర్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

# కౌకూర్--కింది బస్తీ అభివృద్ధికి భారీగా నిధులు

- 90 లక్షలతో స్టార్మ్ వాటర్ డ్రెన్ పైప్‌లైన్ పనులు -- కమ్యూనిటీ హాల్ ఎస్టిమేషన్ ప్రక్రియ వేగవంతం.

కౌకూర్ , అక్టోబర్ 4 :(వార్త ప్రతినిధి) :



యాప్రాల్ డివిజన్ పరిధిలోని కౌకూర్ కింది బస్తీ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. కింది బస్తీలో 90 లక్షలతో స్టార్మ్ వాటర్ డ్రెన్ పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేయించిన శ్రీ మైనంపల్లి హనుమంత్ రావు స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

అదేవిధంగా కింది బస్తీ భజన మందిరం వద్ద రెండు అంతస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించి ఎస్టిమేషన్ ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు కృషి చేస్తున్న శ్రీ మైనంపల్లి హనుమంత్ రావు మల్కాజ్‌గిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ మరియు సోషల్ యాక్టివిస్ట్ తుడిమెళ్ల మల్లికార్జున్ కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

అదేవిధంగా కౌకూర్--యాప్రాల్ ప్రాంతంలో 9.18 కోట్ల విలువైన బాక్స్ డ్రెన్ పనులకు నిధులు మంజూరు కావడంలో శ్రీ మైనంపల్లి హనుమంత్ రావు అన్న గారి సహకారం ఉందని స్థానిక ప్రజలు తెలిపారు. ఈ అభివృద్ధి పనులకు సహకరించిన మల్కాజ్‌గిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ (ఐ.ఏ.ఎస్), ఇంజినీరింగ్ విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ శ లక్ష్మణ్ , డి.ఇ పద్మలత , ఎ.ఇ శ్రీమతి సత్యలక్ష్మి , వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితర అధికారులకు గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా తుడిమెళ్ల మల్లికార్జున్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కౌకూర్--యాప్రాల్ ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. స్టార్మ్ వాటర్ డ్రైనేజ్, బాక్స్ డ్రెన్లు, రోడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తూనే, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

కౌకూర్ ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం మైనంపల్లి హనుమంత్ రావు సహకారంతో ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అల్లీ మల్లేష్, అల్లీ పండు, అల్లీ సత్యనారాయణ, రూపేష్ కుమార్, శ్రీకాంత్, రాకేష్, కృష్ణ, రాజేష్, భాస్కర్, నరేష్, శ్రవణ్ కుమార్, వాళ్లపు మాధవి, ఆకుల పావని, మొగల కవిత, రాజ్యలక్ష్మి, సత్యమ్మ, భూలక్ష్మి, స్వేత, సోనీ తదితరులు పాల్గొన్నారు.

అలాగే కాంగ్రెస్ నాయకులు శివరాజ్, ఆసిఫుల్ల ఖాన్, శ్రీలైలం యాదవ్, సయ్యద్ అస్లాం, ప్రవీణ్ జాన్, హేమంత్, భారత్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో ఎర్రమట్టి దందా..?
# మూడు టిప్పర్లతో యథేచ్ఛగా రవాణా!













- ఎర్రగట్టు తండా--కాశీంనగర్ గుట్టల నుంచి మట్టి తరలింపు?
- సెలవు రోజే మూడు టిప్పర్లు...అనుమతులపై అధికారుల నిఘా ఎక్కడ?
- మట్టి రవాణాకు అనుమతులున్నాయా? పత్రాలు చూపించాలంటున్న ప్రశ్నలు
- ఒక్క టిప్పర్ ఫొటోతో మొదలైన వ్యవహారం...మూడు టిప్పర్ల వరకు విస్తరించిన అనుమానాలు
- పత్రాలు లేవన్న డ్రైవర్,భాను ప్రకాష్ శెట్టి పంపించారు, అంటూ సమాధానం

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో అక్టోబర్ 04 మీ వార్త

వనపర్తి జిల్లా న్యూస్: వనపర్తి జిల్లాలో ఎర్రమట్టి తవ్వకాలు, రవాణాపై అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఎర్రగట్టు తండా, కాశీంనగర్ గుట్టల ప్రాంతం నుంచి చిన్నగుంటపల్లి వైపు ఎర్రమట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో.. మూడు టిప్పర్లతో మట్టి రవాణా జరుగుతోందన్న సమాచారం చర్చనీయాంశంగా మారింది. సెలవు రోజున కూడా టిప్పర్లు తిరుగుతున్నాయన్న సమాచారంతో వాటిలో ఒక వాహనాన్ని ఆపి జర్నలిస్టు వివరాలు అడిగిన సందర్భంలో డ్రైవర్ వెల్లడించిన సమాధానాలు ఇప్పుడు పలు ప్రశ్నలకు తావిస్తున్నాయి. వాహనానికి సంబంధించిన రవాణా పత్రాలు, అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా "ఎలాంటి కాగితాలు లేవు " అని డ్రైవర్ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. వాహనం ఎవరి ఆధ్వర్యంలో నడుస్తోందని ప్రశ్నించగా.. "భాను ప్రకాష్ శెట్టి పంపించారు.. ఆయన ఆదేశాల మేరకు మట్టి రవాణా చేస్తున్నాం" అని డ్రైవర్ తెలిపినట్లు పేర్కొంటున్నారు. అయితే ఈ వాంగ్మూలాన్ని సంబంధిత అధికారులు స్వతంత్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.

**ఎర్రగట్టు తండా నుంచి కాశీంనగర్ వరకు...అసలు తవ్వకాలు ఎక్కడ?**

ఎర్రగట్టు తండా, కాశీంనగర్ గుట్టల ప్రాంతాల్లో ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడి నుంచి మూడు టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం వెలువడటంతో అసలు మట్టి ఎక్కడి నుంచి తీస్తున్నారు? ఎవరి భూమి లేదా గుట్ట ప్రాంతంలో తవ్వకాలు జరుగుతున్నాయి? తవ్వకాలకు మైనింగ్ శాఖ అనుమతి ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తవ్వకాలకు అనుమతి ఉంటే దానికి సంబంధించిన లీజ్ లేదా ఇతర చట్టబద్ధ పత్రాలు ఏమిటి? ఎంత పరిమాణంలో మట్టి తవ్వకునేందుకు అనుమతి ఉంది? ఎంత మట్టిని తరలించేందుకు అనుమతి ఇచ్చారు? రాయల్టీ లేదా సీనియరేజ్ చెల్లించారా? వంటి అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**కాగితాలు లేవు" అన్న సమాధానం నిజమేనా?**

టిప్పర్‌ను ఆపి రవాణాకు సంబంధించిన పత్రాల గురించి అడిగిన సమయంలో డ్రైవర్ పత్రాలు లేవని చెప్పినట్లు సమాచారం వెలువడింది. అదే నిజమైతే మట్టి రవాణాకు ఏ ఆధారంతో వాహనాలు రోడ్డుపై తిరుగుతున్నాయన్నది కీలక ప్రశ్నగా మారింది. వాహనం యజమాని ఎవరు? డ్రైవర్ వద్ద ఏ పత్రాలు ఉన్నాయి? మట్టి ఎక్కడి నుంచి లోడ్ చేశారు? ఎక్కడికి తరలిస్తున్నారు? రవాణా బిల్లులు, రాయల్టీ చలానాలు, అనుమతి పత్రాలు ఉన్నాయా? అనే అంశాలను మైనింగ్, రెవెన్యూ, రవాణా శాఖలు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**మూడు టిప్పర్లు... రోజుకు ఎన్ని ట్రిప్పులు?**

ఒక్క టిప్పర్‌కు సంబంధించిన ఫొటో, డ్రైవర్ సమాధానంతో వ్యవహారం ముగిసిపోకుండా.. మూడు టిప్పర్లు నిజంగా మట్టి రవాణా చేస్తున్నాయా? వాటి నంబర్లు ఏమిటి? రోజుకు ఎన్ని ట్రిప్పులు చేస్తున్నాయి? మట్టి లోడింగ్ పాయింట్ ఎక్కడ? అన్‌లోడింగ్ పాయింట్ ఎక్కడ? అనే వివరాలను అధికారులు పరిశీలించాలి. వాహనాల కదలికలను పరిశీలిస్తే అసలు రవాణా పరిమాణం, మార్గం, తరలింపు ప్రాంతం వంటి వివరాలు బయటపడే అవకాశం ఉంది.

**భాను ప్రకాష్ శెట్టి పేరును ప్రస్తావించిన డ్రైవర్...అధికారుల విచారణ ఎప్పుడు?**

డ్రైవర్ ఇచ్చిన సమాధానంలో భాను ప్రకాష్ శెట్టి పేరును ప్రస్తావించినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలు లేదా డ్రైవర్ వాంగ్మూలం మాత్రమే ఆధారంగా ఎవరినీ నేరానికి బాధ్యులుగా నిర్ధారించలేం. సంబంధిత వ్యక్తి వద్ద ఉన్న అనుమతులు, వాహన పత్రాలు, మట్టి రవాణా రికార్డులు, రాయల్టీ చెల్లింపులు, తవ్వకాల అనుమతులను అధికారులు పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలి.

**అధికారుల తనిఖీతోనే అసలు విషయం బయటకు!**

ఎర్రగట్టు తండా, కాశీంనగర్ గుట్ట ప్రాంతాల్లో మైనింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహిస్తే అసలు తవ్వకాలు జరుగుతున్నాయా? అనుమతులు ఉన్నాయా? అనుమతికి మించి తవ్వకాలు జరిగాయా? మట్టి ఏ ప్రాంతానికి తరలుతోంది? అన్న అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అనుమతులు ఉంటే వాటిని పరిశీలించి చట్టబద్ధతను అధికారులు వెల్లడించాలి. అనుమతులు లేకుండా తవ్వకాలు లేదా రవాణా జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఒక టిప్పర్ ఫొటోతో మొదలైన అనుమానాలు, మూడు టిప్పర్ల వరకు చేరాయన్న ఆరోపణలు, డ్రైవర్ పత్రాలు లేవని చెప్పినట్లు వచ్చిన సమాచారం. రవాణా వెనుక ఎవరున్నారు? మట్టి ఎక్కడి నుంచి వస్తోంది? ఎక్కడికి వెళ్తోంది? అనుమతులు ఉన్నాయా? ఈ ప్రశ్నలకు మైనింగ్, రెవెన్యూ, రవాణా శాఖల అధికారుల తనిఖీ, పత్రాల పరిశీలనతోనే స్పష్టమైన సమాధానం లభించనుంది...

## మతసామరస్యానికి ప్రతీకగా సీతాయిపల్లి

**దుర్గామాత ఉత్సవాలకు ముస్లిం సర్పంచ్ రూ.15 వేల విరాళం**



**గాంధారి :** మతసామరస్యానికి ప్రతీకగా గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామం నిలుస్తోంది. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు అన్ని పండుగలను కలిసిమెలిసి నిర్వహించుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నిర్వహించనున్న దుర్గామాత ఉత్సవాలకు ముస్లిం సోదరుడైన గ్రామ సర్పంచ్ పఠాన్ అంజద్‌ఖాన్ ఆర్థిక సహాయం అందించి సోదరభావాన్ని చాటుకున్నారు. నవజవాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహ ఏర్పాటు నిమిత్తం గ్రామ సర్పంచ్ పఠాన్ అంజద్‌ఖాన్ స్వయంగా రూ.15 వేల ఆర్థిక విరాళాన్ని అందజేశారు. మతాలతో సంబంధం లేకుండా గ్రామంలో నిర్వహించే పండుగలకు సర్పంచ్ అంజద్‌ఖాన్ అందిస్తున్న సహకారాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి పండుగలను నిర్వహించుకోవడం ద్వారా గ్రామంలో మతసామరస్యం, సోదరభావం మరింత బలపడుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు. దుర్గామాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం లో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# అమల్లోకి కొత్త మున్సిపల్ చట్టం

-మొదటిపేజీ తరువాయి

భవనాల్లో అగ్నిప్రమాదాల ముప్పు వంటి కొత్త సవాళ్లు వచ్చాయి. ఈ మార్పులకు అనుగుణంగా నగర పాలనా వ్యవస్థను మార్చేందుకు ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. మూడు కార్పొరేషన్ల ప్రస్తుత సరిహద్దులు మాత్రం మారవు. మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ, కమిషనర్, వార్డు కమిటీ వ్యవస్థ కొనసాగుతుంది. ఐదేళ్ల పదవీకాలం కూడా యథాతథంగా ఉంటుంది.

**ఇంటి రిజిస్ట్రేషన్‌తోనే మ్యుటేషన్?**

ఇంటి కొనుగోలు తర్వాత మ్యుటేషన్‌కు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరాన్ని కొత్త చట్టం తగ్గించనుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మ్యూటేషన్ ఆటోమేటిక్‌గా కొనసాగుతుంది. ప్రతి ఆస్తికి ఇంటిగ్రేటెడ్ ప్రాపర్టీ ఐడెంటిటీ కోడ్ ఇస్తారు. ఆస్తికి సంబంధించిన మున్సిపల్ వివరాలన్నీ ఈ గుర్తింపు సంఖ్యతో అనుసంధానమవుతాయి. ఆస్తిపన్ను, నీటి బిల్లు, మురుగునీటి ఛార్జీలు, పారిశుద్ధ్య బకాయిలను కలిపి 'క్యూర్--1' పేరుతో ఒకే బిల్లు ఇస్తారు. మున్సిపల్ సేవలు, అనుమతులు, లైసెన్సులను ఒకే పోర్టల్ ద్వారా పొందే విధానం వస్తుంది.

**ఆస్తిపన్ను పెంపుపై పరిమితి**

ఈ కొత్త చట్టంలో ఆస్తిపన్ను విధానంలో కీలక మార్పు చేశారు. ఇక వార్షిక అద్దె విలువకు బదులుగా రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే గైడ్‌లైన్ విలువ ఆధారంగా పన్ను లెక్కిస్తారు. 375 చదరపు అడుగుల వరకు ఉన్న ఆస్తులకు రూ.101 నామమాత్రపు పన్నే కొనసాగుతుంది. మిగతా నివాస ఆస్తులకు గైడ్‌లైన్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం మధ్య రేటును ఆయా కార్పొరేషన్లు నిర్ణయిస్తాయి. నివాసేతర ఆస్తులకు 0.20 శాతం నుంచి 2 శాతం మధ్య రేటు ఉంటుంది. కొత్త రేట్లు ఖరారయ్యే వరకు నివాస ఆస్తులకు 0.15 శాతం వర్తిస్తుంది. నివాసేతర ఆస్తులకు 0.75 శాతం రేటు ఉంటుంది. కొత్త విధానంతో ఒక్కసారిగా పన్ను భారం పెరకుండా పరిమితులు విధించారు. గత ఏడాది పన్నుతో పోలిస్తే ఏ సంవత్సరంలోనూ పెరుగుదల 10 శాతం దాటదు. ప్రస్తుతం రూ.10 వేల ఆస్తిపన్ను చెల్లిస్తున్న వ్యక్తి మొదటి ఏడాది గరిష్ఠంగా రూ.11 వేలే చెల్లిస్తారు.

**భవన అనుమతుల్లో ఆలస్యానికి చెక్**

భవన అనుమతుల ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో సాగుతుంది. నిర్ణీత సమయంలో అధికారులు నిర్ణయం తీసుకోకపోతే దరఖాస్తు పైస్థాయికి వెళ్తుంది. నిర్ణయం రాని సందర్భాల్లో డీమ్డ్ అప్రూవల్‌కు చట్టం అవకాశం ఇస్తోంది. లైసెన్సింగ్ విధానాన్ని కూడా సులభతరం చేశారు. రాత్రివేళల్లో ఎక్కువ సమయం వ్యాపార కార్యకలాపాలు కొనసాగే నైట్ ఎకానమీ జోన్లను ప్రభుత్వం ప్రకటించనుంది. చిన్న ఉల్లంఘనలకు క్రిమినల్ కేసులు పెట్టే పాత విధానంలోనూ మార్పు వస్తుంది. చాలా ఉల్లంఘనలకు సివిల్ జరిమానాలు ఉంటాయి. ముందుగా షోకాజ్ నోటీసు ఇస్తారు. ఆ తర్వాతే జరిమానాపై నిర్ణయం తీసుకుంటారు.

**రోడ్డు తవ్వాలంటే.. కమిటీ ఓకే చెప్పాలి**

నగరంలో ఒక శాఖ వేసిన రోడ్డును మరో శాఖ కొద్ది రోజులకే తవ్వే పరిస్థితులకు చెక్ పెట్టేలా కొత్త వ్యవస్థ వస్తోంది. యుటిలిటీ కోఆర్డినేషన్ కమిటీ రోడ్డు తవ్వకాలపై శాఖల మధ్య సమన్వయం చేస్తుంది. ట్రాఫిక్ నిర్వహణకు క్యూర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ అథారిటీ పనిచేస్తుంది. ఫుట్‌పాత్‌లు, పాదచారుల క్రాసింగ్‌లు, కర్బ్ ర్యాంపులు, వీధి దీపాలు, ట్రాఫిక్ సిగ్నళ్లపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. పాఠశాలల వద్ద సేఫ్ స్కూల్ జోన్లు ఏర్పాటు చేసే అవకాశం కూడా కొత్త చట్టంలో ఉంది.

**చెరువులు.. నాలాలకు మరింత రక్షణ**

చెరువులు, నాలాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల పరిరక్షణకు కొత్త చట్టం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. చెరువు, నాలా, ఇతర జలవనరుల్లో మురుగునీరు లేదా కాలుష్య వ్యర్థాలను వదలరాదు. చెరువులు, నాలాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో ఆక్రమణలు, వ్యర్థాలపై చర్యలకు హైడ్రాకు చట్టబద్ధమైన బలం లభిస్తుంది. నిర్మాణ వ్యర్థాలను అనుమతి లేకుండా పారేస్తే కఠిన జరిమానా ఉంటుంది. నాలా, చెరువు, ఫుట్‌పాత్‌పై పారేస్తే జరిమానా రెట్టింపు అవుతుంది. నిర్దేశిత విస్తీర్ణం దాటిన భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. పర్యావరణహిత చర్యలు తీసుకునే ఆస్తులకు అదనపు ఆస్తిపన్ను రాయితీ ఇచ్చే అవకాశం ఉంది.

**విపత్తులకు శాశ్వత ప్రణాళిక**

కోర్ అర్బన్ రీజియన్ మొత్తానికి ఒకే విపత్తు నిర్వహణ ప్రణాళిక ఉంటుంది. క్యూర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ విపత్తుల నివారణ, ముందస్తు సన్నద్ధత, స్పందన, పునరుద్ధరణ చర్యలను సమన్వయం చేస్తుంది. హైడ్రా విపత్తు స్పందన సంస్థగా పనిచేస్తుంది. ఎత్తైన భవనాలు సహా నిర్దేశిత భవనాలకు ఫైర్ ఆడిట్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసే అవకాశం ఉంటుంది. ప్రమాద స్థాయిని బట్టి తనిఖీలు చేపడతారు. ప్రాణాలకు తక్షణ ముప్పు ఉన్న భవనాన్ని లోపాలు సరిచేసే వరకు సీల్ చేయవచ్చు. వీధులు, పార్కులు, బస్‌స్టాప్‌లు, రవాణా కేంద్రాల్లో తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలి. మార్కెట్లు, రవాణా ప్రాంతాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో సీసీ కెమెరాల నిఘాకు చట్టం ప్రాధాన్యం ఇచ్చింది.

**మహిళలు.. వృద్ధులు.. గిగ్ కార్మికులపై దృష్టి**

మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులు, చిన్నారులు, వృద్ధుల అవసరాలను నగర మౌలిక వసతుల్లో పరిగణనలోకి తీసుకోవాలని కొత్త చట్టం చెబుతోంది. జెండర్ ఇన్‌క్లూజన్ సెల్ ఏర్పాటు చేస్తారు. ప్రతి కార్పొరేషన్‌లో ట్రాన్స్‌జెండర్ సమాజం నుంచి ఒకరికి ప్రాతినిధ్యం ఉంటుంది. గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు విశ్రాంతి ప్రదేశాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, పార్కింగ్, ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. వీధి వ్యాపారులకు వెండింగ్ జోన్లలో మౌలిక సదుపాయాలు అందించవచ్చు.

**కాలం చెల్లిన నిబంధనలకు తెర**

70 ఏళ్ల నాటి చట్టంలో వందకు పైగా కాలం చెల్లిన నిబంధనలు ఉన్నాయి. టాంగాలు, జట్కాలు, ఎద్దుల బండ్లు, గుర్రాలు, ఒంటెలు, ఏనుగులపై పన్నుల ప్రస్తావన కూడా పాత చట్టంలో ఉంది. నగరంలోకి వచ్చే సరుకుపై ఆక్ట్రాయ్ వసూలు, ఆవిరి విజిల్ వాడకంపై అనుమతి, ఐదు నుంచి ఇరవై రూపాయల జరిమానాలు వంటి పాత నిబంధనలకు కొత్త చట్టం ముగింపు పలికింది.

# గవర్నర్ కోటాపై కాంగ్రెస్ నేతల నజర్

-మొదటిపేజీ తరువాయి

సామాజికవర్గానికి కేటాయించిన నేపథ్యంలో.. గవర్నర్ కోటాలో బీసీ సామాజికవర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచనలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది

**రెండు స్థానాలు బీసీలకు**

మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీ సామాజికవర్గాలకు కేటాయించే అంశంపై కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. సామాజిక సమీకరణాలతో పాటు పార్టీకి రాజకీయంగా ఉపయోగపడే నేతలను ఎంపిక చేయాలనే ఆలోచనలో నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

**పద్మశాలి కోటాపై సిరిసిల్ల సభలోనే హామీ**

పద్మశాలి సామాజికవర్గానికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించే అంశంపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల సభలో కీలక ప్రకటన చేసిన విషయం చర్చనీయాంశంగా మారింది. పద్మశాలి సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని పెద్దల సభకు పంపుతామని సిరిసిల్ల సభ వేదికగా సీఎం హామీ ఇచ్చిన నేపథ్యంలో.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి ఆ సామాజికవర్గానికి దక్కే అవకాశం ఉందనే చర్చ కాంగ్రెస్‌లో మొదలైంది. పద్మశాలి కోటాలో మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, పున్న కైలాష్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. సీఎం హామీ నేపథ్యంలో ఈ ఇద్దరి పేర్లపై పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది

**ముదిరాజు కోటాలో ఎమ్మెల్సీ పదవి..**

మరో ఎమ్మెల్సీ స్థానాన్ని ముదిరాజు సామాజికవర్గానికి కేటాయించే అంశాన్ని కాంగ్రెస్ నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ముదిరాజు సామాజికవర్గం గణనీయమైన జనాభాను కలిగి ఉండటంతో ఆ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలనే ఆలోచన పార్టీలో ఉన్నట్లు తెలుస్తోంది.

ముదిరాజు కోటాలో మెదక్ ఎంపీ అభ్యర్థి గా పోటీ చేసిన



నీలం మధు పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ ముఖ్య నేతలను కలిసి ఎమ్మెల్సీ అవకాశం కోసం తన ప్రయత్నాల్లో ఉన్నారు. అయితే ఎంపీ ఎన్నికల తర్వాతా నీలం మధుకు సీఎం హామీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి పెద్దపీత వేయాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇది కనుక వర్కౌట్ అవుతుందా లేదా చూడాల్సి ఉంది.

**బీసీ కోటాలో పలువురి పేర్లు**

బీసీ కోటాలో ఎమ్మెల్సీ పదవి కోసం పలువురు నేతల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. చనగాని దయాకర్, సత్తు మల్లేశ్, కౌశిక్ యాదవ్ పేర్లు కూడా పార్టీలో చర్చకు వస్తున్నట్లు సమాచారం..

**మూడో సీటుపై ఆసక్తికర సమీకరణం..**

మూడు స్థానాల్లో మూడో సీటును రెడ్డి సామాజికవర్గానికి కేటాయించే పరిస్థితి వస్తే ఆర్టీఐ కమిషనర్ అయోధ్యారెడ్డి పేరు కూడా రేసులోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. మొత్తంగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తోంది. సామాజికవర్గాల ప్రాతినిధ్యం, పార్టీ విధేయత, రాజకీయ సమీకరణాలు.. ఈ అంశాల ఆధారంగా తుది ఎంపిక ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆశావహుల జాబితాపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ కొనసాగుతోంది.

# ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో వేగం పెంచాలి

-మొదటిపేజీ తరువాయి

43.968 కిలోమీటర్ల ప్రధాన టన్నెల్‌లో ఇప్పటివరకు 79 శాతం పనులు పూర్తికాగా మరో 9.1 కిలోమీటర్ల తవ్వకాలు మిగిలి ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్? కుమార్? రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ప్రస్తుతం రోజుకు 7 నుంచి 7.5 మీటర్ల మేర పనులు జరుగుతున్నాయని, అదనపు డ్రిల్లింగ్ బూమర్, ఎలక్ట్రిక్ లోడర్లు, ఆధునిక ఎక్స్‌కవేటర్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. జర్మనీ నుంచి అక్టోబర్ చివరికి లోకోమోటివ్ రానుందని, దీంతో టన్నెల్‌లో తవ్విన మట్టిని వేగంగా బయటకు తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో 48 గంటలు పట్టిన నిర్మాణ సైకిల్ ప్రస్తుతం 20--24 గంటలకు తగ్గిందని, దాన్ని సుమారు 10 గంటలకు తగ్గించి పనుల వేగం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. మే--జూన్ 2028 నాటికి టన్నెల్-1 బ్రేక్‌త్రూ పూర్తి చేసి జూన్ 2028 నాటికి నీటిని అందించేలా పనులు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్మికుల భద్రతకు అత్యంత



ప్రాధాన్యత ఇస్తూ పనులు కొనసాగించాలని సూచించారు.

**ప్రత్యేక బృందంతో పర్యవేక్షణ**

ఎస్?ఎల్బీసీ సొరంగం పనులు మళ్లీ వేగం పుంజుకుంటున్నాయి. గతంలో జరిగిన ప్రమాదం అనంతరం కొంతకాలం నిలిచిపోయిన పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం తిరిగి ప్రారంభించింది. టన్నెల్ పనులను పూర్తి చేయడంలో వేగంతో పాటు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఎస్?ఎల్?బీసీ సొరంగం పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సైన్యంలో సొరంగాల నిర్మాణంలో పనిచేసిన నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా వీటిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. సొరంగం పనులు వేగవంతం చేసేందుకు అత్యాధునిక త్రీఆర్మ్ బూమర్ యంత్రాన్ని రంగంలోకి దించారు. జపాన్ నుంచి సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఈ యంత్రంను తీసుకొచ్చారు. ఇప్పటివరకు సొరంగం ఎగువ, దిగువ భాగాల్లో వేర్వేరుగా తవ్వకాలు చేపట్టాల్సి వచ్చేది. త్రీఆర్మ్ బూమర్ అందుబాటులోకి రావడంతో ఒకేసారి పూర్తి భాగాన్ని తవ్వే అవకాశం ఏర్పడింది. సుమారు 10 మీటర్ల వ్యాసంతో సొరంగం తవ్వే సామర్థ్యం ఈ త్రీఆర్మ్ బూమర్ యంత్రానికి ఉంది.

## రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు. "నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

## కొత్త జాబ్ కార్డుల జారీకి లైన్ క్లియర్..



-మొదటిపేజీ తరువాయి

దీని వల్ల రైతులు పంట సాగుకు దూరం కావడంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరువు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట సాగు తగ్గిపోవడం, కూలీలకు పని లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో అలాంటివారికి ఉపయోగపడేందుకు కొత్త జాబ్ కార్డులు మంజూరు చేయాలని నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేసుకున్నవారికి 15 రోజుల్లో జాబ్ కార్డు అందించేలా ప్రణాళికలు రచించింది. దీని వల్ల వారికి వెంటనే ఉపాధి లభించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 52.46 కుటుంబాల్లోని 1.08 కోట్ల మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. కరువు పరిస్థితుల క్రమంలో కొత్తగా ఉపాధి పొందాలనుకునేవారికి జాబ్ కార్డులు జారీ చేయనున్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆదాయం లభించనుంది. ఉపాధి అవసరం ఉన్నవారిని గుర్తించి ఈ పథకంలో నమోదు చేయించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం ఆదేశించింది.

ఈ పథకంలో చేరాలంటే 18 ఏళ్లు తప్పనిసరిగా నిండి ఉండాలి. దరఖాస్తు ఫారంను పూర్తి చేసి ఆధార్ కార్డ్ జిరాక్స్, ఫొటోను జత చేయాలి. ఆ తర్వాత దరఖాస్తును ఫారంను మీ గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాల్సి ఉంటుంది. పంచాయతీ కార్యదర్శి పరిశీలన అనంతరం మీ దరఖాస్తును మండల కార్యాలయానికి పంపిస్తారు. ఎంపీడీవో దరఖాస్తును పరిశీలించి మీ అర్హతలను తనిఖీ చేస్తారు. అర్హతలు ఉంటే జాబ్ కార్డు జారీ చేస్తారు. అనంతరం మీకు ఈ జాబ్ కార్డును అందిస్తారు. దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా జాబ్ కార్డు అందించాలని ప్రభుత్వం నిబంధనలు విధిస్తోంది.

ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. దీని వల్ల గ్రామీణులకు ఉపాధి లభిస్తుందని తెలిపింది. అయితే కేంద్రం వీబీ జీరాంజీ పథకంలో అనేక మార్పులు చేసింది. పనిదినాలతో పాటు కనీస వేతనాన్ని కూడా పెంచింది. వారం రోజుల్లో డబ్బులు క్రెడిట్ చేసేలా కొత్త మార్గదర్శకాలు రూపొందింది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్రం ఈ స్కీమ్ అమలు చేస్తోంది.

## విద్యార్థులకు అల్పాహారం కోసం కమ్యూనిటీ కిచెన్



**సూర్యాపేట:** జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనుంది ప్రభుత్వం. ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాల--మాధారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ. 9.60 కోట్ల విరాళం అందించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ నిధులను సమకూర్చినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి కంపెనీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థినికి సన్మానం





**మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్**

**కామారెడ్డి** ఫ కామారెడ్డి జిల్లా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించిన రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన విద్యార్థినికి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సన్మానం చేశారు. రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు టాంకరి రాజేందర్ కూతురు శ్రీజ కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా, ఎల్లారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ...! కష్టపడి చదివి మెడికల్ సీటు సాధించిన విద్యార్థిని పట్టుదల, కృషి అభినందనీయమని కొనియాడారు. సాధించిన ఈ గొప్ప విజయం పోసానిపేట్ గ్రామానికే కాకుండా మొత్తం కామారెడ్డి జిల్లాకే గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు పూర్తి చేసి, సమాజానికి ఉత్తమ వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొని విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణలో అయ్యప్ప సేవకు నూతన శక్తి

**చిన్ముద్ర సేవా ట్రస్ట్ నూతన కార్యవర్గం ఏర్పాటు.. సేవా, ధార్మిక కార్యక్రమాల విస్తరణకు నిర్ణయం**



**బీర్కూర్ :** అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్--ఆలియాబాద్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఆదివారం తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన స్వాములు, గురుస్వాములు, ట్రస్ట్ సభ్యులు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తెలంగాణలోని సుమారు 12 జిల్లాల నుంచి ప్రతినిధులు సమావేశానికి హాజరై ట్రస్ట్ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో నూతన జిల్లా కార్యవర్గ కమిటీలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు అయ్యప్ప స్వామి సేవా కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడంతో పాటు భక్తులను మరింత ఐక్యం చేసేందుకు కృషి చేయాలని నిర్ణయించారు. సమావేశంలో శబరిమలలో కొనసాగుతున్న మహా అన్నదాన కార్యక్రమంపై ప్రత్యేకంగా చర్చించారు. అయ్యప్ప భక్తులకు నిరంతర సేవలు అందించేలా అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. అదేవిధంగా భవిష్యత్తులో సేవా, ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలను మరింత పెద్ద ఎత్తున చేపట్టాలని ప్రతినిధులు తీర్మానించారు.

**నూతన రాష్ట్ర కార్యవర్గం**

తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా వెంకటేష్ గురుస్వామి (చింతల్), గౌరవ అధ్యక్షులుగా వేణుగోపాలరావు గురుస్వామి (జీడిమెట్ల), అధ్యక్షులుగా బొబ్బర్ల సురేష్ స్వామి (మేడ్చల్) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గుత్త చంద్రశేఖర్ గురుస్వామి (ఖమ్మం), కోశాధికారిగా పృథ్వి స్వామి (హైదరాబాద్) బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా బుర్ల శ్రీనివాస్ (భద్రాద్రి కొత్తగూడెం), ఆకుల వెంకటేష్ (మేడ్చల్), కంచోజు సత్యనారాయణ (నిజామాబాద్), మంత నరేంద్ర చారి (సిద్దిపేట్) ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా అమరేంద్ర చారి (సంగారెడ్డి), వెల్డి నాగరాజు (వరంగల్), ప్రాంతీయ కార్యదర్శులుగా నరసింహారావు (ములుగు), పల్లె నిఖిల్ (నిజామాబాద్), నాల్ల నరసింహారావు (మహబూబాబాద్), మణిపుత్ర మహేష్ నియమితులయ్యారు. వాలంటరీ కమాండెంట్‌గా పోతురాజుల వెంకట్రావు (భద్రాద్రి కొత్తగూడెం), పి ఆర్ ఓ గా శేఖర్ స్వామి (భద్రాద్రి కొత్తగూడెం) బాధ్యతలు చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా శంకర్ స్వామి, వంగరి గోపి, సోమిరెడ్డి, సాయం శ్రీనివాసరావు, నటరాజ్ స్వామి, శ్రీకాంత్ శర్మ, జుంజునూర్ బాబురావు, శ్రీనివాసరావు, శ్రీపతి నరసింహారావు, టీ . కృష్ణ, కంచనపల్లి నగేష్, కే. రవీందర్, రామ్ చందర్, నల్ల మాస రవికుమార్, కమ్మరి రాజు, ఇర్వ రాజు, కానూరి దేవిదాస్, సాయి స్వామి తదితరులు ఎన్నికయ్యారు.

**ఘనంగా పాల్గొన్న ప్రముఖులు**

సమావేశానికి ముఖ్య అతిథులుగా రుద్ర కోటేశ్వరరావు, పైలా ఆది మోహన్ రెడ్డి, కర్క సిద్దు, బ్యాల ఈశ్వరయ్య, అనంతరావు, బాలు లెంకల, వైకుంఠరావు, పిట్ట శ్రీహరి, చంటి గురుస్వామి, వాక చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. చిన్ముద్ర కుటుంబ సభ్యులు, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన గురుస్వాములు, ట్రస్ట్ సభ్యులు, అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ట్రస్ట్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అయ్యప్ప భక్తులను ఏకతాటిపైకి తీసుకువచ్చి సేవా కార్యక్రమాలను బలోపేతం చేయాలని సంకల్పించింది. సేవ, ధర్మం, ఆధ్యాత్మికతను ప్రధానంగా చేసుకుని అయ్యప్ప భక్తులకు మరింత విస్తృతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. గురుస్వాముల మార్గదర్శకత్వంలో భక్తుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ శబరిమలతో పాటు తెలంగాణలోనూ వివిధ సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సమావేశంలో ఆకాంక్షించారు.

# మన అడవులు.. మన ప్రాణాలు.. మన బాధ్యత








**ఇందల్వాయి:** ఇందల్వాయి అటవీ రేంజ్ పరిధిలో వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా "మన అడవులు.. మన ప్రాణాలు.. మన బాధ్యత" అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ భట్ మాట్లాడుతూ.. అటవీ రక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఇందల్వాయి రేంజ్ పరిధిలోని ప్రతి సెక్షన్‌లో సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అడవులను అక్రమంగా నరికివేసే వారిపై అప్రమత్తంగా ఉండాలని, చెట్లను రక్షిస్తే అవే మన భవిష్యత్‌ను కాపాడతాయని అన్నారు. అడవుల్లోని వన్యప్రాణులను సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవ చ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి అడవులు, వన్యప్రాణుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ర్యాలీలో సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, అటవీ సిబ్బంది, గ్రామస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ రేంజ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో అందరూ ఐకమత్యంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# కురుమ జిల్లా నూతన కమిటీ ఎన్నిక




**కామారెడ్డి :** కామారెడ్డి జిల్లా నూతన కురుమ యువ చైతన్య జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షులు కుండే వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు గా చెట్కూరి రజినీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్, అంబల సాయి నిఖిల్, జీవియం విఠల్, ప్రధాన కార్యదర్శి చిన్న రవ్య శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పుల్ల గంగాధర్, నార్ల మల్లేష్ , కోశాధికారి కందూరి ఆంజనేయులు, ప్రచార కార్యదర్శి అనిల్, కార్యదర్శి రెడ్డి మల్లేష్, చెట్కూరి ప్రణీత, సలహాదారులని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమల హక్కుల కోసం పోరాడాలని విద్యా, ఉపాధి ,రాజకీయంగా ఎదగాలని అన్నారు. దొడ్డి కొమురయ్య ఆశయాలతో పనిచేయాలని వారి వారసత్వని కొనసాగించాలి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోటే రవి కుర్మా, కన్వీనర్ కొండే శ్రీకాంత్ కురుమ వ్యవస్థాపకులు చెట్టె భాస్కర్, గంగాధర్, గర్గుల బాబు, ధరణి శ్రీను, కొండ మధు కురుమ సభ్యులు పాల్గొన్నారు.

# కవల శిశువుల వైద్యానికి రూ.45,400 ఆర్థిక సాయం

**బీద కుటుంబానికి అండగా నిలిచిన సమాజ సేవకుడు సీతలే రమేష్**



**బీర్కూర్** : వర్ని మండలం జలాల్పూర్ గ్రామానికి చెందిన తిప్పరాం ఆనంద్ గౌడ్ కవల పిల్లలు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో చికిత్స పొందుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న సమాజ సేవకుడు, సేవా కార్యక్రమాల్లో ముందుండే సీతలే రమేష్ స్పందించి ఆర్థిక సహాయం అందించారు. జలాల్పూర్ గ్రామానికి చెందిన స్నేహితులు సీతలే రమేష్‌కు విషయం తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించారు. తన వాట్సాప్ స్టేటస్ ద్వారా విషయం తెలియజేసి దాతల నుంచి నిధులు సేకరించారు. అనంతరం జలాల్పూర్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ బంధువులకు రూ. 45,400 నగదును అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబానికి తనవంతు సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న సీతలే రమేష్‌ను గ్రామస్థులు అభినందించారు. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమంలో సమాజ సేవకుడు సీతలే రమేష్‌తో పాటు బుర్ఖా శంకర్ గౌడ్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్ గౌడ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీకగా సీతాయిపల్లి

**దుర్గామాత ఉత్సవాలకు ముస్లిం సర్పంచ్ రూ. 15 వేల విరాళం**

**గాంధారి :** మతసామరస్యానికి ప్రతీకగా గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామం నిలుస్తోంది. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు అన్ని పండుగలను కలిసిమెలిసి నిర్వహించుకునే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో నిర్వహించనున్న దుర్గామాత ఉత్సవాలకు ముస్లిం సోదరుడైన గ్రామ సర్పంచ్ పఠాన్ అంజద్‌ఖాన్ ఆర్థిక సహాయం అందించి సోదరభావాన్ని చాటుకున్నారు. నవజవాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విగ్రహ ఏర్పాటు నిమిత్తం గ్రామ సర్పంచ్ పఠాన్ అంజద్‌ఖాన్ స్వయంగా రూ. 15 వేల ఆర్థిక విరాళాన్ని అందజేశారు. మతాలతో సంబంధం లేకుండా గ్రామంలో నిర్వహించే పండుగలకు సర్పంచ్ అంజద్‌ఖాన్ అందిస్తున్న సహకారాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి పండుగలను నిర్వహించుకోవడం ద్వారా గ్రామంలో మతసామరస్యం, సోదరభావం మరింత బలపడుతోందని గ్రామస్తులు పేర్కొన్నారు. దుర్గామాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమం లో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



బిజినెస్

# ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ మధ్య తేడా ఏంటి?

## ఐఏఎఫ్ కాంట్రాక్టు లభిస్తే.. భారత్‌లో విమానాల తయారీ!



**వాషింగ్టన్/దిల్లీ:** భారత వాయుసేన (ఐఏఎఫ్) కోసం మధ్య తరహా రవాణా విమానాల సరఫరా కాంట్రాక్ట్ కనుక తమకు లభిస్తే, భారత్‌లో తమ ఉత్పత్తి సామర్థ్యాలను మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని అమెరికా దిగ్గజ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్ సీనియర్ అధికారి వెల్లడించారు. 60 మధ్య తరహా రవాణా విమానాలు కొనుగోలు చేసేందుకు 10.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్ష కోట్ల) అంచనా వ్యయంతో, మనదేశం ఆగస్టులో టెండర్ జారీ చేసింది. ఈ కాంట్రాక్ట్ కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), మహీంద్రా గ్రూప్, అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), రిలయన్స్ డిఫెన్స్ సంస్థలు పోటీలో ఉన్నాయి. ఈ భారతీయ సంస్థలు అంతర్జాతీయ విమాన తయారీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని, ఈ ప్రాజెక్టు బిడ్డింగ్‌లో పాల్గొంటున్నాయి.

**హైదరాబాద్‌లో ఇప్పటికే**

లాక్‌హీడ్ మార్టిన్‌కు టీఏఎస్ఎల్‌తో దీర్ఘకాలంగా భాగస్వామ్యం ఉంది. హైదరాబాద్-వడోదరలో టాటాతో కలిసి సంయుక్తంగా నెలకొల్పిన టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్) ప్లాంట్లున్నాయి. సీ-130జే విమానాలకు వివిధ విడిభాగాలు, వెనుక భాగంలోని నిర్మాణాలను తయారు చేస్తున్నట్లు లాక్‌హీడ్ మార్టిన్ గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ - స్ట్రాటజీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాన్ టెన్నీ తెలిపారు. కొత్త ఆర్డర్ లభిస్తే ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనున్నట్లు ఆయన చెప్పారు. విమానాల తయారీతో పాటు ఇతర కార్యకలాపాలు కూడా భారత్‌లోనే జరిగేలా చూస్తామన్నారు. లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 60 విమానాల్లో 12 విమానాలను పూర్తిగా సిద్ధం చేసిన స్థితిలో భారత్‌కు అందిస్తారు. మిగిలిన 48 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తామని కంపెనీ ప్రతిపాదించింది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఇప్పటికే వినియోగిస్తున్న 12 సీ-130జే విమానాలను కూడా అధునాతన కాన్ఫిగరేషన్‌కు అప్‌గ్రేడ్ చేస్తామనీ లాక్‌హీడ్ మార్టిన్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమలైతే, ఐఏఎఫ్ వద్ద ఒకే రకమైన అధునాతన కాన్ఫిగరేషన్ కలిగిన మొత్తం 72 విమానాలుంటాయి. ప్రస్తుతం ఐఏఎఫ్ వినియోగిస్తున్న సీ-130జే విమానాలు ఇప్పటివరకు 58,000కు పైగా విమాన ప్రయాణ గంటలను పూర్తి చేశాయి. లద్దాఖ్‌లోని అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో ఇవి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. నేపాల్‌లో వరదల సమయంలో సహాయక చర్యలు, 2023లో సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి తరలించే ఆపరేషన్ వంటి కీలక మిషన్లలో ఈ విమానాలను ఉపయోగించారు.

**రిజిస్ట్రేషన్**

మీరు ఏదైనా స్థిరాస్తి కొన్నప్పుడు ప్రభుత్వం వద్ద నమోదు ద్వారా చట్టబద్ధంగా దాని యాజమాన్య హక్కుల్ని బదిలీ చేసుకోవడం అవసరం. కేవలం కొన్నదేగాక, మీకు వారసత్వంగా వచ్చినా, బహుమతి రూపం లో అందినా, వీలునామా ద్వారా సంక్రమించినా ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ప్రాపర్టీ యజమాని బదిలీ చేస్తే తప్ప.. మీరు సదరు ఆస్తికి యజమాని కాలేరుమరి. ఇక ఆస్తి విలువ రూ.100 దాటితే భారతీయ రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 17 కింద ఆ ఆస్తిని రిజిస్టర్ చేయించాల్సిందే. సేల్ డీడ్, వీలునామా, గిఫ్ట్ డీడ్ తదితర యాజమాన్య ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ ఇతర గుర్తింపు పత్రాలు ఇందుకు అవసరమవుతాయి. స్థిరాస్తి ఎక్కడ ఉన్నదో ఆ పరిధిలోని సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సాక్షుల సమక్షంలో కొన్నవారు, అమ్మినవారు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అయితే పేర్కొన్న రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీలను చెల్లించాల్సి ఉంటుంది.

**మ్యూటేషన్**

ప్రభుత్వ భూ రెవిన్యూ రికార్డుల్లో ఆస్తి యజమాని పేరును మార్చడమే మ్యూటేషన్ ప్రక్రియ. ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పూర్తయ్యాకే మ్యూటేషన్‌కు వీలుంటుంది. సంబంధిత పత్రాలను సమర్పించి, మ్యూటేషన్ ఫీజు చెల్లిస్తే స్థానిక మున్సిపల్ కార్యాలయాల్లో పని జరుగుతుంది. ఆస్తి పన్ను, నీరు, విద్యుత్తు, గ్యాస్ కనెక్షన్ల కోసం కూడా ఇది తప్పనిసరి.




తర్వాత రోజుల్లో కొన్న ఆస్తిని తిరిగి అమ్ముకోవాలన్నా ఈ మ్యూటేషన్ ముఖ్యం. పైగా ఈ ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌లు ఆస్తుల తగాదాలనూ నివారించగలవు.

## ఈఎంఐలు భారం కానున్నాయా? ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచే ఛాన్స్

**ముంబయి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలకమైన రెపోరేటును పెంచే అవకాశం ఉంది. అక్టోబర్ నెల ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును 0.25 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు, బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితుల కారణంగా నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలకు తోడు, ఇతర కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు సవరిస్తుండడమే ఇందుక్కారణమని పేర్కొంటున్నారు. ఒకవేళ విశ్లేషకులు ఊహించినట్లే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు సవరిస్తే.. రెపోరేటుతో ముడిపడి ఉన్న గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. ఆ మేర నెలవారీ చెల్లించే ఈఎంఐలు భారం కానున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచింది. దీంతో అప్పట్లో రెపోరేటు 6.50 శాతానికి చేరింది. ఆపై 2023-24లో స్థిరంగా కొనసాగించింది. 2025లో వరుసగా వడ్డీ రేట్లు తగ్గించిన ఆర్‌బీఐ.. పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో స్థిరంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ఎంపీసీ భేటీలో రెపోరేటుపై నిర్ణయం తీసుకోనుంది. బుధవారం నిర్ణయం వెలువడనుంది.

**పాత ప్రీమియం కార్లను కొనేద్దాం**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులతో సమానంగా ఆర్‌బీఐ కూడా వడ్డీ రేట్లు సవరించవచ్చని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వృద్ధి ఊపందుకోవడం వంటివి ఇందుకు కారణాలని చెబుతున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తడం వల్ల ఇంధనం, కమొడిటీ ధరలు పెరుగుతున్నాయని, దీనివల్ల మరోసారి రెపోరేటు పెంచొచ్చని అభిప్రాయపడుతున్నారు. పీటీఐ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, మరోసారి స్టేటస్ కో కొనసాగించే



అవకాశమూ లేకపోలేదని మరో ఆర్థికవేత్త అభిప్రాయపడ్డారు. డిమాండ్ ఆధారిత ద్రవ్యోల్బణం ఇంకా ఊపందుకోని కారణంగా మరికొంతకాలం వేచి చూసే ధోరణిని ఆర్‌బీఐ అవలంబించొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# ఖతార్‌లో కలుద్దాం..

## అట్టహాసంగా ముగిసిన ఆసియా గేమ్స్

**నగోయా (జపాన్) :** రెండు వారాల పాటు వేలాది మంది ఆసియా క్రీడాకారుల హోరాహోరీ పోరాటాలకు వేదికగా నిలిచిన 20వ ఆసియా గేమ్స్‌కు తెరపడింది. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం 90 నిమిషాల పాటు సాగిన ముగింపు వేడుకలు కనువిందు చేశాయి. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (ఓసీఏ) అధ్యక్షుడు షేక్ జోఆన్ బిన్ హమద్ అల్ థానీ క్రీడలు ముగిసినట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం ఓసీఏ పతాకాన్ని 2030 ఎడిషన్‌కు ఆతిథ్యం ఇచ్చే ఖతార్‌లోని దోహా నగర ప్రతినిధులకు అధికారికంగా అందజేశారు. ఖతార్ హైజంప్ దిగ్గజం ముతాజ్ బార్షిమ్ నుంచి ఈక్వెస్ట్రియన్ రైడర్ జాసిమ్ అల్ కువారీ ఆసియాడ్ పతాకాన్ని స్వీకరించాడు. ముగింపు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన అథ్లెట్ల పరేడ్‌లో భారత ట్రాప్ షూటర్ నీరూ ధండా త్రివర్ణ పతాకాన్ని చేతిలో పట్టుకుని ముందు నడిచింది. తెలుపు, నీలం రంగు దుస్తులు ధరించిన సుమారు 30 మంది భారత అథ్లెట్లు, అధికారులు ఈ మార్చ్‌పాస్ట్‌లో పాల్గొన్నారు. 'వన్ ఆసియా' అనే ఇతివృత్తంతో రూపొందించిన వేదికపై జపాన్ సాంప్రదాయ 'బొన్-ఒడోరి' నృత్యాలు, 'మత్సుకెన్ సాంబా2' ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



**ఆరంభ లోపాలను దాటి**

ఈసారి ఆసియా క్రీడల నిర్వహణలో జపాన్ భిన్నమైన వ్యూహాన్ని అనుసరించింది. భారీ ఖర్చులతో ప్రత్యేకంగా అథ్లెట్స్ విలేజ్‌లు, కొత్త స్టేడియంలు నిర్మించకుండా.. అందుబాటులో ఉన్న వేదికలు, తాత్కాలిక నిర్మాణాలతో తక్కువ ఖర్చుతో క్రీడలను నిర్వహించింది. ఆరంభంలో హోటల్ వసతి సమస్యలు, రవాణా ఆలస్యం, అక్రిడిటేషన్ గందరగోళం ఎదురైనప్పటికీ.. నిర్వాహకులు త్వరగానే లోపాలను సరిదిద్ది పోటీలను విజయవంతంగా ముగించారు. 45 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది అథ్లెట్లు పాల్గొన్న పోటీల్లో 54 ప్రపంచ రికార్డులు, 89 ఆసియా రికార్డులు బ్రేక్ అవడంతో ఈ ఆసియాడ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.

## డివిలియర్స్ విధ్వంసం.. విండీస్‌పై సౌతాఫ్రికా భారీ స్కోరు



వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) 2026 టోర్నీలో భాగంగా వెస్టిండీస్ చాంపియన్స్‌తో జరుగుతున్న టీ20 మ్యాచ్‌లో సౌతాఫ్రికా చాంపియన్స్ భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ ఏబీ డివిలియర్స్ (39 బంతుల్లో 70; 4 ఫోర్లు, 5 సిక్సర్లు), ఓపెనర్ రిచర్డ్ లెవీ (39 బంతుల్లో 87; 5 ఫోర్లు, 8 సిక్సర్లు) భారీ అర్ధశతకాలతో విధ్వంసం సృష్టించారు. వీరిద్దరి బీభత్సం ధాటికి సౌతాఫ్రికా చాంపియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. చివర్లో సారెల్ ఎర్వీ (23) ధాటిగా ఆడాడు. వెస్టిండీస్ చాంపియన్స్ బౌలర్లలో డేవ్ మొహమ్మద్ రెండు వికెట్లు తీయగా, ఫిడెల్ ఎడ్వర్డ్స్, రెయాడ్ ఎమ్రిట్, డ్వేన్ బ్రావో తలా ఒక వికెట్ తీశారు. ముందుగా రిచర్డ్ లెవీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఫోర్లు, సిక్సర్లతో మైదానం హోరెత్తించాడు. అగ్నికి వాయువు తోడైనట్లు లెవీకి డివిలియర్స్ జత కలవడంతో స్కోరుబోర్డు ఉరకలెత్తింది. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 104 పరుగులు సాధించి సౌతాఫ్రికా భారీ స్కోరుకు బాటలు వేశారు. లెవీ ఔటైనప్పటికీ, సారెల్ ఎర్వీతో కలిసి డివిలియర్స్ జట్టు స్కోరును 200 దాటించాడు.

స్పోర్ట్స్

## ముకేష్ వికెట్ల వేట.. 30వసారి 'ఇరానీ' విజేతగా రెస్టాఫ్ ఇండియా..!



భారత వన్డే జట్టులో చోటు కోల్పోయిన రిషభ్ పంత్ దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటాడు. ఆటగాడిగా ధనాధన్ బ్యాటింగ్‌తో అలరించే పంత్ ఈసారి కెప్టెన్‌గా రెస్టాఫ్ ఇండియా(=వర్ రాట ×అఎఋ)కు టైటిల్ అందించాడు. ఇరానీ కప్ (×తీఋఅఱ జబజూ) ఫైనల్లో ముకేశ్ కుమార్(2-84, 33-6) ఎనిమిది వికెట్లతో విరుచుకుపడగా.. పంత్ సారథ్యంలోని రెస్టాఫ్ ఇండియా 167 పరుగుల తేడాతో జమ్ము కశ్మీర్‌ను ఓడించింది. దాంతో రికార్డు స్థాయిలో ముప్పయ్యోసారి ట్రోఫీని ముద్దాడింది. ఇరానీ ట్రోఫీ 2026-27 ఫైనల్లో రెస్టాఫ్ ఇండియా అదరగొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ సనత్ సాంగ్వన్(55) అర్ధ శతకంతో శుభారంభమివ్వగా.. స్మరణ్ రవిచంద్రరన్(135) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. అనంతరం 279 పరుగుల ఛేదనలో జమ్ము కశ్మీర్ బ్యాటర్లను పేసర్ ముకేశ్ కుమార్ (2-84, 33-6) వణికించాడు. బుల్లెట్ బంతులతో నిప్పులు చెరిగిన ముకేశ్ ఏకంగా ఆరుగుని ఔట్ చేసి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బతీశాడు. దాంతో.. జమ్ము 111 రన్స్‌కే కుప్పకూలింది. ఆల్‌రౌండ్ షోతో కనబరిచి 167 పరుగుల తేడాతో గెలుపొందిన రెస్టాఫ్ ఇండియా 30వ సారి ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచింది. తద్వారా జట్టుకు ట్రోఫీ కట్టబెట్టిన రెండో వికెట్ కీపర్‌గా పంత్ గుర్తింపు సాధించాడు. ఖతర్నాక్ శతకంతో విజయంలో భాగమైన స్మరణ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

# మట్టితో మమేకమైన కూలీ కథ

హీరో శర్వానంద్ నటిస్తున్న ఇంటెన్స్ పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. సంపత్‌నంది దర్శకుడు. కేకే రాధామోహన్ నిర్మాత. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా ఈసినిమా టీజర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. గ్రామీణ జానపద శైలిలో సాగే వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. బొగ్గుల గుట్ట అనే గ్రామాన్ని అక్కడి నాగరికతనూ, పగలు, ప్రతీకారాలు, భక్తి, మూఢ విశ్వాసాల నేపథ్యంలో టీజర్ సాగింది. శర్వా రఫ్ అండ్ రగ్డ్ లుక్‌లో మట్టితో మమేకమైన ఓ సాధారణ కూలీగా కనిపించారు. అనుపమ పరమేశ్వరన్ పాత్ర కూడా సీరియస్ మోడ్‌లో ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నది. 1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో సాగే ఈ కథను దర్శకుడు సంపత్‌నంది ఎంతో సహజంగా, నేటివిటితో తెరకెక్కిస్తున్నట్టు టీజర్ చెబుతున్నది. రా, ఇంటెన్స్, రూటెడ్ ప్రపంచాన్ని టీజర్ ఆవిష్కరించింది. డింపుల్ హయాతీ మరో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిశోర్‌కుమార్ అరోకియా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.



# విశ్వక్‌సేన్ 'కల్ట్' విడుదల అప్పుడే

విశ్వక్‌సేన్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కల్ట్'. తారక్ సినిమా పతాకంపై సందీప్ కాకరాల భారీ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్‌ని పూర్తి చేసుకున్నది. హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో నిర్మించిన భారీసెట్‌లో వందలాది మోడల్స్‌తో 40-50 రోజుల పాటు జరిగిన కీలక సన్నివేశాల చిత్రీకరణతో షూటింగ్ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. భారతీయ భాషలతోపాటు విదేశీ భాషల్లో కూడా ఈ సినిమాను విడుదల చేస్తున్నామని, ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా 'కల్ట్' విడుదల కానున్నదని మేకర్స్ చెప్పారు. గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మురళీశర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, తారక్ పొన్నప్ప, ప్రజ్ఞ ఇతరపాత్రధారులు. ఈచిత్రానికి మాటలు: తరుణ్‌భాస్కర్, సౌండ్ డిజైన్: 'యానిమల్'ఫేం సచిన్.



# ఓ వైపు శాంతం మరోవైపు రౌద్రం

ప్రస్తుతం సాయిపల్లవికి మహర్దశ నడుస్తున్నది. ఒక కథానాయికగా దేశవ్యాప్తంగా తిరుగులేని గుర్తింపు రావడం అరుదైన విషయం. అన్ని భాషలకు చెందిన ప్రేక్షకులూ తమ హీరోయిన్‌గా ఓన్ చేసుకోవడం ఈ మధ్య సాయిపల్లవి విషయంలోనే జరిగిందని చెప్పక తప్పదు. వచ్చే నెలలో రెండు వారాల తేడాతో ఆమె సినిమాలు రాబోతున్నాయి. వాటిలో మొదటిది నితీష్ తివారీ 'రామాయణ: పార్ట్ 1'. ఈ పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యంలో సాయిపల్లవి సీతామహాసాధ్విగా కనిపించనున్నారు. సరిగ్గా ఈ సినిమా విడుదలైన రెండు వారాలకు, అంటే.. నవంబర్ 20న ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఓం: చాప్టర్ 1' విడుదల కానున్నది. ఇందులో సాయిపల్లవిది కీలకమైన పాత్ర. యాక్షన్, ఎమోషన్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని సమాచారం. రెండు వారాల గ్యాప్‌తో రెండు పొంతన లేని పాత్రల ద్వారా ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని సాయిపల్లవి పంచనున్నదని సినీవర్గాలు అంటున్నాయి. ఈ ప్రయత్నాలు రెండూ ఫలిస్తే.. సాయిపల్లవి క్రేజ్ దేశవ్యాప్తంగా మరింత పెరగడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.






# 'చకోర' ఓ అమ్మ చెప్పిన కథ

శ్రవణ్, మలైకా టి వాసుపల్ జంటగా నటించిన చిత్రం 'చకోర -- లూనార్ లవ్ బర్డ్'. మంగా శ్రీనివాస్ దర్శకుడు. చింతాడ హేమారావు నిర్మాత. అక్టోబర్ 9న సినిమా థియేట్రికల్ రిలీజ్ కానున్నది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ వైజాగ్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు శివ నిర్వాణ అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'ఇదొక అమ్మ చెప్పిన ప్రేమకథ. కేవలం వర్షపునీళ్లతోనే దాహం తీర్చుకునే విశిష్టమైన పక్షి చకోర. ఆ పక్షిలాగే మనం కూడా స్వచ్ఛమైన పేమ కోసమే వేచి చూడాలని, అలాగే.. చకోర పక్షికి జాబిల్లిని చేరాలని కోరిక. దాని కోసం అలుపెరగకుండా ప్రయాణిస్తుంది. ఆ ప్రయత్నంలోనే మరణిస్తుంది. మనం కూడా చకోర పక్షిలా లక్ష్యాన్ని చేరుకునేందుకు అవిశ్రాంతంగా శ్రమించాలని ఈ సినిమా ద్వారా చెబుతున్నాం' అని దర్శకుడు మంగా శ్రీనివాస్ అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు శ్రవణ్, మలైకా ఆనందం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందం అంతా మాట్లాడారు.


printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS. published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512